శిలాఫలాలు తింటున్నారా?

నవతెలంగాణ సోపతి

26 జులై, 2015

★ నాగన్ కథ : 'సె'లవ్'

★ జూకంటి జగన్నాథం, బి. నర్సన్ కవితలు

నారీ... 'పాల'భేరీ...

చర్నాకోల


అవినీతి ఆరోపణలతో రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్‌కింగ్స్ లపై వేటు...
IPL
RR
CSK
అవినీతి


ముందు చేసిన ఏర్పాట్లకన్నా, విషాదం జరిగిన ఒక్క పూటలోనే ప్రజలు దాన్ని మర్చి పోయి, మళ్లా పుష్కర ఘాట్లకి లక్షల సంఖ్యలో తరలి వచ్చేట్లు మేనేజ్ చేసినందుకు సారు చాలా హేపీగా ఉన్నారయ్యా....
ముగిసిన పుష్కరాలు


కార్పొరేట్లకు పర్మిట్లు
జరంత కిందమ్మాడా జూడుండి సారూ....

అంతరంగం

నేర్చుకోవడం

"జీవితం ఓ పాఠం కాదు. ఓ అనుభవం తర్వాత మరో అనుభవం. ప్రతీ అనుభవమూ దేనికదే ప్రత్యేకమయింది. అసంఖ్యాకమైన స్వాగతద్వారాలతో జీవితం ఓ మహోత్సవం" అంటారు కవి పఠాభి. నేర్చుకోవాలన్న ఆసక్తి వున్నవారికి ఈ స్వాగతద్వారాలు సులువుగా తెరుచుకుంటాయి. చేసిన పనిని చేస్తూ పోవడమే కాదు, ఇంకా ఏదో చేయాలన్న తపన, కొత్తగా సృజించాలన్న ఆరాటం మనుషుల్ని నేర్చుకోడానికి ప్రేరేపిస్తాయి. కవి పఠాభి కూడా అంతే, కేవలం కవిగానే నిలిచిపోలేదు. కవిత్వం కన్నా ఎక్కువగా గణితంతో ప్రయోగాలు చేశారు. అనేక దేశాలు పర్యటించారు. వ్యాపారాలు చేశారు. వాటిలో వైఫల్యాలు తన మంచికేనని తలపోశారు. సామ్యవాద స్వప్నాల మీదుగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆ తర్వాత ఆయనా, భార్య స్నేహలతారెడ్డి 'సంస్కార' సినిమా తీశారు. వారికి ఉన్న సోషలిస్టు భావజాలం ఎమర్జెన్సీలో జైలు పాలు జేసింది. అయినా జైల్లోనూ మహిళా ఖైదీల హక్కుల కోసం పోరాడారు స్నేహలతారెడ్డి. ఆ క్రూర ఎమర్జెన్సీ నిర్బంధ ప్రభావమే ఆమె ప్రాణాల్ని హరించింది. అయితే నేర్చుకోవడమనే ప్రక్రియ ఆమె జీవితంలోనూ, పఠాభి జీవితంలోనూ చివరికంటా సాగింది.

నేర్చుకోవడమంటే ఓ కొత్త అనుభవానికి స్వాగతం పలకడం. ఫలితం ఎలా ఉన్నా సరే, ప్రయత్నించాలన్న పట్టుదల ఉండాలి. చాలామంది యవ్వనకాలంలో ఏవో కలలు కంటారు. కానీ ఆ తర్వాత తమకు ఇష్టం లేని వృత్తి ఉద్యోగాల్లో చేరిపోతారు. కొందరిలో అసంతృప్తి రగులుతుంటుంది. అప్పుడు చేస్తున్న పని కాకుండా ఇంకా ఏదో చేయాలని ఉందంటూ తమ కలల ప్రాజెక్టుల గురించి ఉద్వేగంగా చెబుతుంటారు.

నిజంగానే ఆలోచనలు, ప్రణాళికలు కొత్తగా, సృజనాత్మకంగా ఉంటాయి. అది వారి కలల ప్రాజెక్టు. కానీ దానిని ఆరంభించడానికి చొరవ చూపరు. ఉద్యోగాలు చేస్తూ కూడా కొన్ని పనులు చేయొచ్చు. ఓ పుస్తకం రాయొచ్చు. ఒక వెబ్‌సైట్ ప్రారంభించవచ్చు. ఒక షార్ట్ ఫిలిం తీయొచ్చు. ఓ ట్రావెలాగ్ రాయొచ్చు. రాయాలనే ఉంటుంది. చేద్దామనే అనుకుంటారు. కచ్చితమైన ప్రణాళికలు వేసుకుంటారు. కానీ మొదలు పెట్టడానికే చొరవ చూపరు. కొన్నిసార్లు చేపట్టిన కార్యం విఫలమయితే ఎలా అనుకుంటూ గుంజాటన పడతారు. కానీ వైఫల్యం మరింత బాగా చేయడం ఎలానో నేర్పుతుంది.

ఆఫీసులో నిర్దేశిత లక్ష్యాన్ని, నిర్దేశించిన కాలపరిమితిలో పూర్తి చేయడానికి ఒళ్ళు హూనం చేసుకుంటూ కష్టపడతారు. పగలు రేయనకుండా శ్రమించి గడువులోగా పూర్తి చేస్తారు. కానీ ఇదే శ్రద్ధ, ఇదే కష్టం, ఇదే తపన, ఇదే నిమగ్నత, ఇదే పట్టుదల సొంత ప్రాజెక్టు మీద చూపకపోతే ఎలా? అందుకని కోరికలు, కలలు ఉండగానే సరిపోదు. క్రియాశీలురు కావాలి. నేర్చుకోడానికి, చేపట్టడానికి చేతల్లోకి దిగాలి. ఏకకాలాన బహుళ వ్యాపకాల్లో నిమగ్నమై రాటుదేలడానికి అనువైన కాలమిది. అప్పుడే జీవితం నిలువనీరులా ఉండదు. నదిలా ప్రవహిస్తుంది. నేర్చుకునే ప్రతి కొత్త అంశమూ మన అనుభవ సంపదను ఇనుమడింపజేస్తుంది. పఠాభి చెప్పినట్లు అంతిమంగా జీవితం ఉత్సవ సంరంభంగా వెలుగులీనుతుంది.

నవతెలంగాణ సోపతి
ఆదివారం అనుబంధం
26 జులై, 2015

చౌరస్తా బుర్రకో బుద్ధి! ... 5
హాసవిలాసం ... 6
కవర్ స్టోరీ
నారీ 'పాల'భేరీ... ... 7
సంగీతం దక్షిణ భారత నైటింగేల్ ... 11
బిషప్ శవపేటికలో గర్భస్థ శిశువు! ... 12
ఆర్ట్ కొత్త కుంచెలో పాత ప్రపంచం ... 13
కథ సె'లవ్' ... 16
మహిళా మాణిక్యాలు
రాజనీతికుశల సంగం లక్ష్మీబాయి ... 18
సరాగం ప్రేమే నిజమైన ఔషధం ... 19
నెమలీక ... 20
మన సంస్థానాలు
కొల్లాపూర్‌లో కోటలు అనేకం ... 22
వికాసం లక్ష్యానికనుగుణంగానే సామర్థ్యం ... 23
సమీక్షలు
సూర్యుడి వేలుపై సూర్యోదయం ... 24
పదకేళి ... 25
ఈ వారం కవిత్వం
సూర్యున్ని మేల్కొల్పేవాడు ... 26
శిలాఫలాలు తింటున్నారా? 14

లేఖలు



కవర్‌స్టోరీలో ఎన్నో వింతలు విశేషాలు..

జులై 12 సోపతి ఆదివారం సంచికలో కవర్‌స్టోరీ 'నాటి తెలివాహ నేటి తెలంగాణ' వ్యాసం గోదావరి పుష్కరాల సందర్భంగా ఎన్నెన్నో విషయాలను, వింతలను, విశేషాలను ఎంతో సమగ్రంగా, సచిత్రంగా తెలియజేసింది. రచయితకి ధన్యవాదాలు. ఆద్యంతమూ తెలంగాణ వ్యవహారిక భాష నుడికారాలతో సాగిన రుక్మిణి 'ఎలుక తోకలు' కథ బాగుంది. 'వికాసం'లో 'ఆత్మవిశ్వాసమే ఆయుధం', 'సరాగం'లో 'జ్ఞాపకాలు పునరావృతమవుతాయా?' ప్రత్యేకవ్యాసం 'ఉత్తేజ భరితమైన జీవితం' ఎంతో ప్రయోజకరమైనవి. సంగీతంలో 'సోలో గీతాల లీల' వ్యాసం ఎన్నెన్నో సంగతులను తెలియజేసింది.

- అత్తివిల్లి బాలసుబ్రహ్మణ్యం, శేరిలింగం పల్లి.

లీల పాట మధురం..

ఆదివారం అనుబంధంలో 'సంగీతం' శీర్షికలో లీల గాన వైభవం వర్ణన బాగుంది. అలనాటి నటి సావిత్రికి అచ్చంగా అతికే గొంతు లీలదే. ఆమె పాడిన సోలో యుగళ గీతాలు, శ్రోతలను ఇప్పటికీ వీనుల విందు చేస్తాయి. లీల పాటగా "పులకించని మది పులకించు.." పెళ్ళి కానుక పాటను ప్రస్తావించారు. కానీ ఆ పాట పాడిన గాయని జిక్కీ. పాత పాటలు ఆ పాత మధురాలుగా ప్రచురించే నవతెలంగాణ పత్రికకు అభినందనలు.

- యం.వి.రమణకుమారి, హైదరాబాద్

సంచార జీవుల ప్రతిబింబం

జులై 12న సోపతిలో 'ఎలుకతోకలు' కథ అదిరింది. కథలో ఎంచుకున్న భాష పాతకాలపు మనుషులు మాట్లాడుతున్న తీరుగా వుంది. ఇప్పుడా భాష కల్తీగా మారింది. ఇప్పుడు మనం మాట్లాడే భాషను చూస్తే ఎంత మార్పు వచ్చిందో గమనించవచ్చు. కుచేలం పాత్ర నవ్వించింది. ఎలుకల వేట చేసి జీవించే పొయిలు పాత్ర జైల్లో వుండైనా కాస్త తిండి తినొచ్చు అనుకునే అతడి ఆక్రందనలో నిజం వుంది. సమాజంలో ఒక పూట తిండి కూడా దొరకని నిర్భాగ్యులెందరో వున్నారు. అలాంటి వారు హైదరాబాద్‌లో 30 వేలకు పైన ఉన్నట్లు అధికారిక సమాచారం. వారి గూర్చి ప్రభుత్వం ఆలోచించాలి. ఎలకతోకలు కథ సంచార జీవుల జీవితాలను ప్రతిబింబించింది. రచయితకు, సోపతికి అభినందనలు.

- ఎం.భాస్కర్, ఖమ్మం

ఉత్తేజభరితం

ఈ వారం సోపతి ప్రత్యేక వ్యాసం 'ఉత్తేజభరితమైన జీవితం" అంటూ 'మీరాకోశాంబి' గూర్చి వివరాలందించారు. ఆమె చేసిన కృషి ప్రస్తావించారు. నిజంగా ఆమెది ఉత్తేజభరితమైన జీవితమే. ఆర్టిస్టు మోహన్‌కు ధన్యవాదాలు. ఎలుకతోకలు కథ తీరు ఆకట్టుకుంది. కవర్‌స్టోరీ కథనం ద్వారా తెలియని విషయాలు తెలుసుకున్నాం.

- చిక్కుడు అశోక్, రామచంద్రాపురం

సాహసమే జీవితం

సోపతిలోని 'అంతరంగం' శీర్షికలో సాహసం గూర్చి బాగా రాసారు. లక్ష్యం చేరాలంటే సాహసం చేయాలి. బ్రిటీషు సామ్రాజ్యవాదుల్ని గడగడలాడించిన భగత్‌సింగ్ సాహసం గొప్పది. అధైర్యపడితే లక్ష్యం చేరలేరు. స్పార్టకస్, చెగువేరా, కొమురం భీమ్‌ల సాహసం, త్యాగాలు మరువలేనివి. ప్రాణాలను సమాజం కోసం తృణప్రాయంగా వదిలిన వారి జీవితాలు యువతరానికి స్ఫూర్తిదాయకం. ప్రతి వ్యక్తి తన లక్ష్యాన్ని ముందుగా నిర్దేశించుకొని, కార్యాచరణ రూపొందించుకుని ముందుకెళ్ళాలి. ఇక్బాల్ హుస్సేన్ వేశ్యల ఆత్మగౌరవాన్ని నిలపడం కోసం చిత్రాలను వేయటం, సామాజిక చరిత్రపై మీరాకోశాంబి ఫెమినిస్టుగా వ్యాసాలు రాయడం కూడా ఓ సాహసమే.

- తరాల చంద్రబాబు, పాలకుర్తి

మూఢనమ్మకాలు

హిమాలయాల్లో ఉన్న టిబెట్‌లో ఎన్నో నమ్మకాలు ఆశ్చర్యపరుస్తూ ఉంటాయి. అయితే ఈ నమ్మకాల్లో మూఢనమ్మకాలే ఎక్కువ. భారతీయులకు కొన్ని వారాలన్నా, తేదీలన్నా అశుభ దినాలుగా భావిస్తారు. చాలా మంది మంగళవారం నాడు ఏదైనా పని మొదలు పెట్టాలంటే ఇష్టపడరు. అలాగే శుక్రవారం అంటే ఎంతో మంచిరోజుగా భావిస్తారు. ఇక అమావాస్యనాడు, అమావాస్యకు ముందు రోజు మంచిరోజులుగా పరిగణించరు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో చాదస్తాలు భారతీయుల్లో కనిపిస్తాయి. ఇంతకు మించిన చాదస్తాలు టిబెట్‌లోనూ దర్శనమిస్తాయి. టిబెట్ క్యాలెండర్ ప్రకారం కొన్ని రోజులు మహా చెడ్డరోజులు. ఉదాహరణకు పదమూడవ తారీఖున శుక్రవారం వచ్చిందంటే అది దుర్దినం కిందే లెక్క. అలాగే నెన్‌పా గు డ్జోమ్ అనే రోజు (మన అమావాస్య రోజు లాంటిది అనుకోండి) అత్యంత చెడ్డ దినంగా భావిస్తారు. పదకొండవ టిబెట్ మాసంలో ఆరవ రోజున మధ్యాహ్నం పన్నెండు గంటల నుండి మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటల వరకు ఉన్న కాలాన్ని నెన్‌పా గె డ్జోమ్ దినంగా భావిస్తారు. మరి ఆ రోజేం చేస్తారో తెలుసా? పిక్‌నిక్‌కి వెళతారు. పెద్ద పెద్ద బౌద్ధ లామాల (గురువులు) ను కలవడం దగ్గర నుంచి పార్టీలు చేసుకోవడం వరకు అన్ని రకాల ఆనందాన్ని పొందే పనులు ఆ రోజున పెట్టుకుంటారట.

సోపతిపై మీ స్పందనలు sopathisunday@gmail.comకు పంపించండి.

బుర్రకో బుద్ధి!

సముద్రం అల్లకల్లోలం అయింది. ముంచుకు వచ్చిన ముప్పుని ఎవరూ తప్పించలేక పోయారు. ఒడ్డుకు దగ్గర్లో ఉన్న రాతి బండలకు దారీ తెన్నూ లేకుండా ఉయ్యాల్లా ఊగుతూ వచ్చి కొట్టుకుని తునాతునకలయిన ఓడలోంచి పోయినవి పోగా, మిగిలిన ప్రాణులు ప్రాణాలతో ఒడ్డున పడ్డయి.

స్పృహ తప్పి నేలను కర్చుకున్న వాళ్ళు సొక్కి సోలిపోయి, కాలూ చేయీ కదిలించని వాళ్ళు, ఇంకా బతికే ఉన్నామా అని డవుటొచ్చి తమని తాము గిల్లుకున్న వాళ్ళు కొన్ని గంటల తర్వాత క్రమంగా కోలుకుని, మొదట లేచి కూర్చుని తర్వాత నిలబడి, ఆ పైన కాళ్ళు జాడించి, ఏ ఊరో, ఏ పేరున్న ఊరో తెలీని ఆ ప్రదేశంలో ముందుకు నడిచారు. ఒకరి తర్వాత ఒకరు చొప్పున అందరూ కల్సి ఓ గుంపుగా బైల్దేరారు.

అలా నిర్మానుష్యంగా ఉన్న బాటమీద ముందుకు కదిలిన ఆ గుంపు మిట్టమధ్యాహ్నం వేళకి విరివిగా చెట్లూ, ఆ చెట్ల కొమ్మలకి వేలాడుతున్న బంగారు రంగు పండ్లూ ఉన్న చోట ఆగారు. ఆకలిగా ఉన్న వాళ్ళకి తిండానికి ఏమైనా దొరుకుతుందా అని ఆశగా, ఆబగా వెదుక్కుంటున్న వాళ్ళకి, తాము ఇది వరకు రుచి చూసిన ఫలాల జాడ కనిపించలేదు. చెట్లమీద కనిపిస్తున్న పండ్లు తిండానికి పనికి వస్తయోలేదో తెలీదు.

అలా వాటివైపే చూస్తూ నిలబడ్డారు చాలాసేపు. ఆ తర్వాత ఇక ఆగలేక పోతే ప్రాణం ఎలాగూ పోతుంది అనుకున్న ఓ మనిషి, చెట్టు కొమ్మలకి వేలాడుతున్న ఓ పండు తెంపి తినసాగాడు. అతని వైపే ఆందోళనగా చూశారు తత్తిమ్మా వాళ్ళు. సాహసం చేసి పండుని పూర్తిగా తిన్న మనిషి ఎగిరి గంతేశాడు. అద్భుతం! అమోఘం! అని అరుస్తూ మరో పండు తెంపాడు.

ఇగనేం జనమంతా చెట్లమీద పడ్డారు. పండ్లతో కడుపు నింపుకుని అక్కడే సెటిలైపోయారు. ఇళ్ళూ వాకిళ్ళైనవి. వంటావార్పూ లేదు. అందరికీ అక్కడి పండ్లే నిత్య ఆహారమైనవి. మొట్టమొదట పండు తిన్నవ్యక్తి ఆ జనానికి నాయకుడయ్యాడు. వీళ్ళు తింటున్న పండ్లల్లో కొన్ని తియ్యగానూ, కొన్ని కొంచెం పుల్లగానూ ఉండేవి. కొంచెం రంగు తేడా ఉండేది. ఎవరి నాలుక్కి నచ్చినవి వాళ్ళు తింటూ ఉండేవారు. పుర్రెకో బుద్ధీ, జిహ్వకో రుచీ అన్నారు కదా!

మనుషులూ, మనస్తత్వాలూ, అభిప్రాయాలూ ఒక్కటిగా ఉండవు కద ఎప్పటికీ. కానిచోట అందరూ కల్సి ఉండాలన్న ఆలోచన ఎల్లకాలం అంటిపెట్టుకుని ఉండదు కనక, ఎవరికి తోచినట్టు వారు ఆలోచించడం మొదలుపెట్టారు. ఒక్క తాటిమీద ఉండకుండా అటూఇటూ జంపు చెయ్యసాగారు. పుల్లటి పండ్లు తినేవారు, తియ్యటి పండ్లు తినేవారు గ్రూపులుగా విడిపోయారు. ఒకటి రెండయినవి కనుక నాయకులు కూడా ఒకరికి ఇద్దరయ్యారు. రుచులు వేరయినట్టే, అభిప్రాయాలు వేరైనయి. అభిప్రాయాలు భిన్నం అవడంతో వైషమ్యాలు మొదలైనయి. ఒక గ్రూపులో వాళ్ళని చూసి మరో గ్రూపులో వాళ్ళు మండిపడసాగారు. ఈర్ష్యా ద్వేషం, అసూయ మొదలైనవి. కుట్రలూ, కుయుక్తులు, కక్షలూ, కార్పణ్యాలూ మొదలయినవి. మనిషి నుంచి మనిషిని విడదీసేవి యివే కదా. మనిషికి మనిషిని శత్రువుని చేసేవి ఇవే కదా!

ఎవరి రుచులు వారు ఆస్వాదిస్తూ, ఎవరిమానాన వారు ఉంటే అసలు ఏ గొడవా ఉండేది కాదు. అంతా సవ్యంగా సజావుగా సాగిపోయి ఉండేది. పుల్లటి పండ్ల గ్రూపువారు, తియ్యటి పండ్ల గ్రూపువారిని ఏమైనా చెయ్యాలనుకున్నారు. ఈ సైడు వాళ్ళు కూడా ఆ పక్కవాళ్ళకు తగిన బుద్ధి చెప్పాలనుకున్నారు. వాళ్ళ ఆలోచనల్లోని విషం మందుగా మారింది. పుల్లటి పండ్ల గ్రూపువారు తియ్యటి పండ్ల చెట్లకి ఏదో మందు పెట్టారు. ఇవతలి వారూ అవతలివారి చెట్లకు అదే పని చేశారు.

క్రమక్రమంగా ఈ రకం చెట్లూ, ఆ రకం చెట్లూ ఎండిపోవడంతో వీళ్ళకే కాదు, వాళ్ళకి కూడా పండ్లు దొరక్కుండా పోయేయి. పండ్లు తినడం తప్ప మరో రకంగా తిండికి యేర్పాట్లు లేకపోవడం వల్ల రెండు గ్రూపుల్లోనూ జనం కళ్ళు తేలేయడం మొదలుపెట్టారు.

పడవ ప్రమాదంలో ప్రాణాలు మిగిల్చుకున్న వాళ్ళంతా కొద్ది రోజుల్లోనే వాటిని తమ స్వయంకృతాపరాధం కారణంగా పోగొట్టుకున్నారు. ఒక్క జాతికి చెందిన వారైనా మనుషులంతా ఒక్కటిగా ఉండలేక పోవడమన్నది మానవ జాతి ఆవిర్భవించిన నాటి నుంచీ ఉన్నదే!!!

- చింతపట్ల సుదర్శన్, 9299809212

హాసవిలాసం



అంతా ఖాళీ

మొదటి దొంగ : గోడ దూకి ఇంట్లోకి వెళ్లావు కదా! ఏం దొరికింది?

రెండో దొంగ : ఏమీ దొరకలేదు

మొదటి దొంగ :ఎందుకని?

రెండో దొంగ : బయటకొచ్చాక చూశా ఇంటి ముందు టులెట్ బోర్డును.

తెల్ల కాగితం

టీచర్ : రామూ ! జవాబులు రాయకుండా తెల్లకాగితం ఇచ్చావెందుకు?

రాము : శుభ్రతకు అయిదు మార్కులు వేస్తామన్నారని!

ధైర్యం

నర్సు : చిన్న ఆపరేషనే...మీరేమీ భయపడకండి...

రోగి : అబ్బే... నాకేం భయం లేదు...

నర్స్ : నేను చెబుతున్నది మీకు కాదండి. డాక్టర్‌కి!

ఉన్నతస్థాయి

విజయ్ : మొదటి అంతస్తులో ఖాళీ ఉంటే పన్నెండో అంతస్తులో కావాలంటున్నావెందుకు?

వెంగళప్ప : నన్నెప్పుడూ ఉన్నత స్థాయిలో చూడాలని మా నాన్నగారి కోరిక!

గుర్తుపడితే ఎలా?

గోవింద్ : నా స్నేహితుణ్ని భోజనానికి పిలిచా. వాడి కంటపడకుండా ఆ వెండి గ్లాసు, పళ్లెం జాగ్రత్తగా ఉంచు.

భార్య : ఏం అతనిది దొంగబుద్ధా?

గోవింద్ : కాదు వాడి వస్తువులను గుర్తుపడతాడని !

ఆదిమానవుడు

రవి :చింటూ ! ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషనల్లో అందరూ నిన్ను చూసి పరుగులు పెట్టారట, ఏం వేషం వేశావ్?

చింటు : ఆదిమానవుడి వేషం

భలే వ్యాపారం

వెంగళప్ప :వ్యాపారంలో లక్షల్లో నష్టపోయాను...

రాజారావు : ఇంతకీ ఏం వ్యాపారం చేశారు?

వెంగళప్ప : కాశ్మీర్‌లో కూలర్ల దుకాణం పెట్టా !

భద్రం



కొడుకు : నాన్న ! ఈ డబ్బు అమ్మకు తెలియకుండా దాయాలి. ఎక్కడ పెట్టను?

తండ్రి : అయితే నా ప్రశంసా పత్రం వెనకాల పెట్టు!



ఎంతఖర్చో...!

భార్య : వంటల పుస్తకం పది రూపాయలేగా ఎందుకు కొనలేదు !

భర్త : పుస్తకం పదే. కాని అందులో వంటలు చేయడానికి వేలు తగిలేస్తావని!

నస భరించలేక...

ఆఫీసర్ : ఎందుకలా చెవుల్లో దూది పెట్టుకున్నావు?

రాము : ఏమీ లేదు సార్. ఇంట్లో నా భార్య నస భరించలేకపోతున్నా. అందుకే ఈ దూది.

ఆఫీసర్ : అలాగా మరి ఆఫీసులోనూ పెట్టుకున్నావే?

రాము : ఇక్కడ మీరున్నారుగా!

– సేకరణ : మౌక్తిక్, హైదరాబాద్

నారీ... 'పాల'భేరీ...

నమిలికొండ అజయ్‌కుమార్
9490099140

ఆలోచనకు ప్రాణం పోసే యుక్తి, అనుకున్నది సాధించగలమనే శక్తి ఉంటే అక్షరమే రానక్కర్లేదు. అద్భుతాలు సృష్టిం చేందుకు పురుషులే కానక్కర్లేదు. చదువు రాకపోయినా, ఎవరి సహకారం లేకున్నా అచంచెలమైన ఆత్మవిశ్వాసం, శ్రమించేతత్వం, దీర్ఘకాలిక లక్ష్యం ఉంటే చాలు ఏ రంగంలోనైనా రాణించొచ్చు. అందుకు నిదర్శనమే ముల్కనూర్ 'స్వకృషి' మహిళలు. 'క్షీర' విప్లవంతో ప్రపంచంలోనే తమకంటూ ఒక పేజీని లిఖించుకున్న ధీర వనితలు. కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి అనగానే ఒకప్పుడు మాజీ ప్రధాని పివి నరసింహారావు ఊరు వంగర గుర్తుకొచ్చేది. ఇప్పుడు ఆ మాట వినగానే ముల్కనూర్ డెయిరీ అందరి నోటా వినిపిస్తోంది. ఈ ఖ్యాతి వెనుక ఎంతోమంది నారీమణుల శ్రమశక్తి దాగుంది. పచ్చని పంటలతో కళకళలాడాల్సిన పల్లెలు కరువు కాటకాలు, దుర్భిక్ష పరిస్థితులు, చీడపీడలు, ప్రకృతి వైపరిత్యాలు, ధరలలేమి, విద్యుత్‌కోతలు అన్నదాతల వెన్నువిరుస్తుంటే పాడి పరిశ్రమ వారికి చేయూ తనందించింది. సాగులో శ్రమకు తగిన ఫలితం రాకున్నప్పటికీ అన్ని కాలాల్లోనూ పాలకు గిట్టుబాటునందిస్తూ కుటుంబాలకు బాసటగా నిలుస్తోంది. భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులను ముందే ఊహించి సమిష్టిగా నిర్మించుకున్న డెయిరీ ఇప్పుడు 'ఇంతింతై వటుడింతై' అన్నట్లుగా ముందుకు సాగుతోంది. **60** గ్రామాల్లో రోజుకు **5** వేల లీటర్లతో ప్రారంభమై ఇప్పుడు **127** గ్రామాల్లో **35** వేల లీటర్ల పాలను సేకరిస్తూ **4** జిల్లాలకు విస్తరించింది. అంకిత భావం, బాధ్యతాయుతమైన పాలకవర్గంతో ఆటు పోట్లను అధిగమించి మహిళా ఉద్యమాన్ని అనతికాలంలోనే దేశ,విదేశాలకు చాటింది. ఉత్తమ సహకార సంఘంగా ఎంపికై ఏకంగా రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకుంది. తెలంగాణ రాష్ట్రంలో ఆ మాటకొస్తే దేశంలోనే 'ముల్కనూర్ మహిళా సహకార డెయిరీ' గ్రామీణ మహిళల జీవనోపాధికి, ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతూ విజయపథంలో దూసుకెళ్తోంది. జులై **27**కు **13** వసంతాలు పూర్తి చేసుకుని **14**వ వార్షికోత్సవంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా 'సోపతి' అందిస్తున్న కథనం 'స్వకృషి' మహిళల 'సహకార' స్ఫూర్తికి ప్రత్యేకం...

అసలే మెట్ట ప్రాంతం.వర్షాలు కురవక, పంటలు పండక పదేళ్లుగా కరువుతో అల్లాడుతున్న పరిస్థితి. బీడు భూములను చూస్తూ గుండెలు బాదుకునే రోజులు. అప్పులు పెట్టుబడులైతే దిగుబడులు కన్నీళ్లు అవుతున్న దుర్దినాలు. పశువులు కబేళాలకు తరలుతున్న తరుణం. దేశానికి అన్నం పెట్టే రైతు తిండిలేక అలమటిస్తున్న దుస్థితి, అన్నదాతను ఆత్మహత్యలకు ఉసిగొల్పుతున్న దారిద్ర్యం. ఇవన్ని కూడా ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంకు అధ్యక్షుడు, ప్రస్తుత ఇఫ్‌కో ఛైర్మన్ అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిని కదిలించాయి. అప్పటికే గ్రామీణ బ్యాంకుకు బలమైన పునాదులున్నాయి. బ్యాంకు ద్వారా ఈ ప్రాంతంలో సహకార సంఘాల కార్య కలాపాలు కొనసాగుతున్నాయి. బ్యాంకు వ్యవస్థాపకులు, కీర్తిశేషులు విశ్వనాథరెడ్డి గొప్ప దార్శనికత, సహకారి లక్షణం, ఈ బ్యాంకుకు దేశవ్యాప్తంగా మంచి పేరుంది. అదే స్థాయిలో ఈ చుట్టు పక్కలా రైతన్నల అండా ఉంది. విశ్వనాథరెడ్డిని ఈ ప్రాంతంలో సహకార ఉద్యమానికి ఆదర్శప్రాయుడుగా భావిస్తారు.ఆ

స్ఫూర్తితో అతని కొడుకు ప్రవీణ్‌రెడ్డి అన్ని విధాలా ఆలోచించి పాడిపరిశ్రమ ద్వారా రైతు కుటుంబాలను బాగు చేయాలనుకున్నాడు. వారి ఆర్థికాభివృద్ధికి ఇదే తోడ్పాటుగా నిర్ణయించుకుని తన ఆలోచనను 'స్వశక్తి' సంఘాల మహిళలతో పంచుకున్నాడు. జాతీయ పాడి పరిశ్రమ సంస్థ సహకారంతో డెయిరీ నిర్మాణానికి శ్రీకారం చుట్టాడు. ఆయన ఆలోచనకు 2000 సంవత్సరంలో బీజం పడితే మరో రెండేళ్లలో కల సాకారమైంది.

2002లో పురుడు...

ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంకు సహకారంతో 2002 ఆగష్టు 17న డెయిరీ పురుడు పోసుకుంది. 8 ఎకరాల మైదాన స్థలంలో రూ.3.31కోట్లతో ప్రారంభించగా ఇందులో రూ.1.80కోట్లు భవన నిర్మాణం, రూ.1.80 కోట్లతో యంత్రాలను కొనుగోలు చేశారు. తొలిదశలో 60 గ్రామాలు, 72 సంఘాలు, 5,200 మంది సభ్యురాళ్లతో రోజుకు 5వేల లీటర్లు సేకరించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ ఇప్పుడు 127 గ్రామాల్లో 22వేల మంది మహిళలతో 35వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. డెయిరీ ప్రారంభించిన 8నెలల్లోనే 12వేల లీటర్లను సేకరించారంటే సంస్థ స్వ'కృషి'ని చెప్పుకోవచ్చు. 1992లో ఏర్పడి విజయవంతంగా నిర్వహిస్తున్న మహిళా పొదుపు సంఘాల పాత్ర తోడైంది. దాని ప్రత్యామ్నాయ అనుబంధ, ఆదాయ అవసరాల కోసం జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ గుజరాత్ వారి సాంకేతిక సాయం డెయిరీ అభివృద్ధికి ఎంతగానో దోహదపడింది. పాల ఉత్పత్తి సాధ్యత, గ్రామాల్లోని మిగులు పాలు, దగ్గర్లోని పట్టణాల్లో ఉన్న పాల అమ్మక డిమాండ్‌ను సాధించే ప్రణాళికతో ముందుకు సాగింది.

నమ్మకమే పెట్టుబడి...

మహిళా సహకార డెయిరీ వినియోగదారుల నమ్మకమే పెట్టుబడిగా మార్కెట్లోకి తీసుకొచ్చారు. మొదట్ల పాడిపశువుల పోషణ, పాల సేకరణ, వ్యాపార లాభానష్టాలు, మార్కెట్లో గుత్తాధిపత్యం వంటి కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. మొదటగా వరంగల్ పట్టణంపై దృష్టి సారించారు. ఇక్కడ 30వేల లీటర్ల పాల అమ్మకాలకు డిమాండ్ ఉన్న విషయం డెయిరీ సొంత సర్వే ద్వారా గుర్తించారు. ఈ పట్టణంలో 60నుండి 70శాతం అసంఘటిత వ్యవస్థ ద్వారా, నాణ్యత లేని పాలను డెయిరీ ప్లాంట్ల ద్వారా కల్తీ పాలు సరఫరా చేస్తున్నారనే విషయాన్ని గ్రహించారు. ఈ క్రమంలో 60 గ్రామాల్లో ఒక్కో గ్రామంలో 10 మంది చొప్పున సంఘంగా తయారు చేసుకుని సరైన ప్రణాళిక రూపొందించుకుని ముందుకెళ్లారు. ఎంతమంది నుంచి పాలు వస్తాయి. ఎన్ని లీటర్లు వస్తాయి అని ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. పాడిపశువులు ఉన్న ఇంటిని గుర్తించి మహిళలతో ప్రత్యేకంగా మాట్లాడారు. విస్తృతంగా ప్రచారం చేసి డెయిరీ పట్ల నమ్మకం కలిగించి పాల సేకరణ చేపట్టారు. సభ్యులందరూ వరంగల్, కరీంనగర్ జిల్లా కేంద్రాల్లో ఇంటింటికీ,



పరిమళించిన 'పుష్ప'ం..

...అవును 'పుష్ప'ం పరిమళించింది. చదువు లేకపోయినా ఆమె ఆత్మవిశ్వాసమే ఎదుగుదలకు దోహదపడింది. ఆ స్ఫూర్తే 22వేల మంది మహిళలతో నడిచే డెయిరీకి అధ్యక్షురాలిని చేసింది. పల్లెలో పుట్టినా అంచెలంచెలుగా ఎదిగి ఢిల్లీ స్థాయిలో స్త్రీశక్తిని చాటింది. ఆమె జీవన గమనాన్ని పరిశీలిస్తే పట్టుదలతో సాధించలేనిదంటూ ఏదీలేదని నిరూపించింది.. పేరు కడారి పుష్పలీల. చదివింది 8వ తరగతి. కరీంనగర్ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామం. భర్త శ్రీనివాస్ రావు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మూడెకరాల భూమి ఉంది. వ్యవసాయ పనులకు ఆమె చేదోడు వాదోడుగా ఉండేది. నిత్యం పొలం దగ్గరకు వెళ్లడం. ఇంటికొచ్చిన తర్వాత పశువులకు మేత వేయడం, ఇంటి పనులు చూసుకోవడం ఇదే ఆమెకు తెలిసిన లోకం. 2002లో ముల్కనూర్‌లో డెయిరీకి బీజం పడింది. డెయిరీ నిర్వాహకులు ఓ రోజు గ్రామానికి వచ్చారు. ఆమె ఇంటి ముందే సమావేశం నిర్వహించారు. ఆ రోజే పుష్పలీల జీవితం మలుపు తిరిగింది. 100 రూపాయలిచ్చి సంఘంలో సభ్యత్వం తీసుకుంది. సభ్యత్వం తీసుకున్నాక పాల కోసం ఉన్న ఆవుకు తోడు గేదెను కొనుగోలు చేసింది. 15 రోజులకోసారి బిల్లు ఇస్తుండ టంతో సంతోషపడి ఇంకొంత అప్పు చేసి మరో గేదెను కొంది. ఆవు, రెండు గేదెలతో రోజుకు 10లీటర్ల పాలుపోసేది. నెలకు 6వేల రూపాయలచ్చేవి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయే పంటల కంటే పాలతోనే లాభమనుకుని దానిపై దృష్టి సారించింది. గ్రామంలో మహిళలను చైతన్యపరిచి ఒకతాటి పైకి తీసుకొచ్చింది. డెయిరీ సేవలను విస్తరించేందుకు గ్రామ స్థాయి నుంచే కృషి మొదలు పెట్టింది. కొంత కాలం తర్వాత గ్రామ పాల సంఘంలో సభ్యుల ద్వారా డైరెక్టర్‌గా ఎన్నుకోబడింది. ఆ తర్వాత 2011 జులై 30న డెయిరీ అధ్యక్షురాలిగా ఎన్నికైంది. మహిళల భాగస్వామ్యంతో నెలకొల్పిన సహకార డెయిరీ జాతీయస్థాయిలో ఖ్యాతి పొందింది. నేషనల్ కో ఆపరేటివ్ ఎక్సలెన్సీ (ఎన్‌సిటిసి)– 2012కు అవార్డును, రూ.1.5 లక్షల రివార్డును రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా అందుకుని డెయిరీ కీర్తిని దేశ చరిత్ర పుటల్లో చేర్చింది.

అవరోధాలు ఎదుర్కొన్నప్పుడే అభివృద్ధి

అవరోధాలు ఎదుర్కొన్నప్పుడే మహిళలు అభివృద్ధి సాధిస్తారు. పట్టుదల ఉంటే మహిళలకు సాధ్యంకానిదంటూ ఏదీ లేదు. దానికి 'స్వకృషి'తో ఎదిగిన తన జీవితం కూడా ఒక ఉదహరణే. పల్లె నుంచి వెళ్లి ఢిల్లీలో రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందు కోవడం మరచిపోలేని అనుభూతి. పదేళ్ల క్రితం గ్రామాల్లో సారాకు బానిసై ఎంతో మంది తమ కుటుంబాలను చీకటిమయం చేసు కుంటున్న సమయంలో డెయిరీ వారి జీవితాల్లో వెలుగులు నింపింది. ఇప్పుడు ఒక్కో కుటుంబం నెలకు రూ.10వేల నుంచి 12వేలు సంపాదించే స్థాయికి తీసుకెళ్లింది. ఇది గ్రామీణ మహిళల స్ఫూర్తికి నిదర్శనంగా చెప్పొచ్చు.

– డెయిరీ అధ్యక్షురాలు పుష్పలీల

ప్రముఖుల సందర్శన..

డెయిరీని ఈ 13 ఏళ్లలో ఉమ్మడి రాష్ట్రంలోని మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యే, కలెక్టర్లు అధికారులు ఎంతో మంది సందర్శించారు. 'స్వకృషి' పాల ఉత్పత్తి, మహిళా సంఘాల అవశ్యకతను తెలుసుకుని అభినందించారు. విదేశాల నుండి కూడా ప్రతినిధులు డెయిరీని విజిట్ చేశారు. 2012లో భూటాన్ దేశానికి చెందిన ఐదుగురు ఎంపిలు, 20మంది ఐఎఎస్‌లు, 2013లో కెనడా బృందం డెయిరీని సందర్శించింది. శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్రికా, టాన్జనియా, కెన్యా, ఉగండా, ఫిలిప్పిన్, అఫ్ఘానిస్తాన్, నెద ర్లాండ్, నైజీరియా, ఉత్తర భారతదేశం నుంచి గుజరాత్, కర్ణాటక, అస్సాం, మహారాష్ట్ర నుండి సైతం ప్రతినిధులు సందర్శించారు. బీహార్‌లో ఇలాంటి డెయిరీని నెలకొల్పేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కొంత మంది విద్యార్థులు తమ రీసెర్చ్ ఫెలోషిప్‌కు ముల్క నూర్ డెయిరీనే ఎంచుకుని రచనలు చేస్తున్నారు. మహిళల విజయగాథను విన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ డెయిరీని సందర్శించి మహిళల స్వశక్తిని అభినందించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముల్కనూర్ బ్యాంకును సందర్శించారు. డెయిరీ గురించి తెలుసుకుని పాల విప్లవాన్ని ప్రశంసించారు.

వాడవాడలా తిరిగారు. 'స్వకృషి' పాలు అమ్ముతున్నామని పేరుకు తగినట్లుగానే మహిళల స్వయంకృషితో నిర్వహిస్తున్నామని వివరించారు. దీనికి 30కిలో మీటర్ల పరిధి నిర్ణయించుకోవడం, పాల నాణ్యతను, రవాణాలో ఖర్చును తగ్గించే విధంగా అను సరించారు. ప్రతి సంఘం నుండి రెండు పూటల పాల సేకరణ చేయడం, 15 రోజులకోసారి పాల బిల్లును తప్పని సరిగా చెల్లిం చడం, ఇందుకోసం కచ్చితమైన తేదీలు నిర్వహించడం చేశారు. మార్కెట్ అనుసంధానంలో మధ్య తరహా పట్టణాలు, చిన్న పట్ట ణాలపై దృష్టి పెట్టారు. రోజువారి నగదు అమ్మకాలైన ద్రవరూప పాలు, పెరుగు మజ్జిగను వరంగల్, కరీంనగర్, మెదక్, ఆదిలా బాద్ జిల్లాల్లో మార్కెట్ చేయడం వంటి పద్ధతులు అవలంబించారు. ప్రారంభంలో లీటర్ గేదె పాలకు రూ.23, ఆవు పాలు రూ.18 చెల్లించారు. ఇప్పుడు రూ.40, రూ.25కు కొనుగోలు చేస్తూ మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారు. పాలను 20 వ్యానుల్లో నాలుగు జిల్లాలకు సరఫరా చేస్తూ భౌతికంగా, ఆర్థికంగా అనుకున్న అంచనాలను మించారు.

ఇంతింతై..వటుడింతై...

డెయిరీ అనతికాలంలోనే ఇంతింతై వటుడింతై అన్నట్లుగా దూసుకెళ్లింది. అభివృద్ధి బాటలో నడుస్తూ సభ్యులకు బోనస్‌నూ అందించింది. రూ.3కోట్ల 31లక్షల పెట్టుబడితో మొదలైన 13 ఏళ్లలో తన శక్తిని 5వేల మంది మహిళల నుండి 22వేల మందికి పెంచుకుని మార్చి నాటికి 16కోట్ల 17లక్షల రూపాయల లాభాన్ని తన సభ్యులకు పంచింది. గ్రామ స్థాయి డెయిరీ నుండి పొందిన అప్పును పూర్తిగా చెల్లించి ఆర్థిక క్రమశిక్షణను అనుసరిస్తూ సభ్యులను చైతన్యవంతులుగా తయారు చేస్తోంది. దీనికి తోడు స్పష్టమైన వ్యాపార పద్ధతి, సభ్యుల ప్రత్యక్ష పాలన, సంస్థాగత నిర్మాణంలో అనుసరించిన పద్ధతుల ద్వారా ఆర్థిక ప్రగతి సాధించిందనే చెప్పాలి. క్షేత్ర పరిధిలో సహకార వ్యవస్థపై ఉన్న నమ్మకం, ప్రభావితం చేసే నాయకత్వం, చట్టపరమైన స్వేచ్ఛ లేదా గుజరాత్ ఆనంద్ తరహా సహకార వ్యవస్థకు మించిన నిర్మాణం, ఇవన్నీ కలిపి సంస్థ అద్భుతమైన,అసమానమైన ప్రగతికి తోడ్పడినవి. దేశంలోనే మహిళలతో నిర్వహించబడుతున్న డెయిరీ ఎక్కడా లేకపోవడం, ఇవన్నీ ముల్కనూర్ డెయిరీ తన సభ్యుల నుండి అపారమైన నమ్మకాన్ని సాధించింది. 13 ఏళ్లలో సభ్యుల నమ్మకం తీసుకునే పాల బిల్లు నుండి 5శాతం పొదుపుల రూపములో రూ. 4కోట్ల 20కోట్లు (మార్చి 2015) పెట్టుబడిగా పొంది, 2లక్షల వాటా ధనం నుండి 2015 ముగింపు సమయానికి రూ.1కోటి 90 లక్షలకు పెంచుకో గలిగింది. 2011-12 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.68కోట్లు, 2013-14కు రూ.74 కోట్లు, 2015లో రూ.87 కోట్ల టర్నోవర్ చేసింది. దేశవ్యాప్తంగా పాల నాణ్యత విషయంలో రెండు సార్లు ఉత్తమ అవార్డును అందుకుంది. ప్రస్తుతం పాలతో పాటు మజ్జిగ, పెరుగు, నెయ్యి, స్వీట్‌ను తయారు చేస్తూ 2016కు గాను రూ.90కోట్ల వ్యాపారాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.

సంఘాల పాత్ర - ప్రత్యక్ష పాలన..

డెయిరీలో పొదుపు సంఘాల పాత్ర చాలా కీలకంగా చెప్పొచ్చు. పాలు సేకరించే 127 గ్రామాల్లో సంఘాలు ఉంటాయి. అధ్యక్షురాలితో పాటు 9 మంది సభ్యులుంటారు. కొన్ని గ్రామాలకు ఒకరు చొప్పున మొత్తం 12 మంది డైరెక్టర్లు ఉంటారు. గ్రామ కమిటీ అధ్యక్షుల నుంచి వీరు ఎన్నికవుతారు. ప్రతి సంవత్సరం ముగ్గురు చొప్పున కొత్తగా డైరెక్టర్లు చేరుతారు.వీరిలో ఒకరు ఛైర్మన్‌గా ఉంటారు. ఇందులోంచి ఒకరు అధ్యక్షులుగా ఎన్నికవుతారు. వీరి పదవీకాలం నాలుగేళ్లు. రహస్య బ్యాలెటు ద్వారా ప్రతినిధులను ఎన్నుకుంటూ ప్రజాస్వామ్య పద్ధతిలో సంస్థను నిర్వహించుకోవడం ద్వారా సమర్థులకే నిర్వహణ బాధ్యతలు రావడం పాలనా విధానాన్ని తెలియజేస్తోంది. మహిళా

పాడి రైతులకు ప్రోత్సాహకం ఇవ్వాలి

ప్రభుత్వం పాడి రైతులకు లీటర్ పాలకు రూ.4చొప్పున ప్రోత్సాహకం ఇవ్వాలి. అప్పుడు పల్లెవాసులు మరింత ఆర్థికాభి వృద్ధి సాధిస్తారు.ప్రభుత్వం మాత్రం గవర్నమెంట్ డెయిరీలకు, డెయిరీఫామ్స్‌కు ప్రోత్సాహకం ఇస్తోంది. రైతుల దినదినాభివృద్ధికి తోడ్పాడుతూ రోజుకు 35 వేల లీటర్ల పాలను సేకరించే 'స్వకృషి' డెయిరీని మాత్రం పట్టించుకోవడం లేదు. జాతీయ స్థాయిలో ఉత్తమ సహకార సంఘంగా ఎంపికై మహిళలచే నడుపబడుతున్న డెయిరీని వివిధ దేశాల ప్రతినిధులు ఎంతో మంది ఆదర్శంగా తీసుకుం టున్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఇంకా దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా లీటర్ పాలకు రూ.4 ప్రోత్సాహకం ఇచ్చి పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈనెల 30న జరిగే 13వ వార్షికోత్సవ సభలో మరిన్ని తీర్మానాలు చేసుకుని సంఘటితంగా డెయిరీ అభివృద్ధి కృషి చేస్తాం.

- ఎం.భాస్కర్‌రెడ్డి, డెయిరీ జనరల్ మేనేజర్

డెయిరీకి తొలిసారిగా ముల్కనూర్‌కు చెందిన అన్నవరం రత్నమాల ఎన్నికయ్యారు. తర్వాత హుస్నాబాద్ మండలం మీర్జాపూర్‌కు చెందిన వంగ విజయ, ప్రస్తుతం ఎల్కతుర్తి మండలం దండేపల్లికి చెందిన కడారి పుష్పలీల కొనసాగుతున్నారు. ప్రతి నెలా డైరెక్టర్లు సమావేశమై సమస్యలు తెలుసుకుని పరిష్కరించుకుంటారు. వార్షిక లెక్కల వివరాలను ప్రతి సభ్యురాలికి అందిస్తూ డెయిరీ వ్యవహారాల్లో నమ్మకాన్ని, పారదర్శకతను కలిగిస్తారు. సంఘాల వార్షిక లెక్కల్లో సభ్యురాలి వ్యక్తిగత లావాదేవీలను కూడా రాత పూర్వకంగా తెలియజేయడం, సమితి లావాదేవీలను సభ్య సంఘాలకు బహిర్గతంగా ఉంచే పద్ధతి సమితి సంఘాల గొప్ప అనుబంధాన్ని సభ్యులు ఏర్పర్చుకోగలిగారు. సంస్థ నిర్మాణం, పద్ధతుల తయారి ముసాయిదా దశల్లో సభ్యుల ఆలో చన లను పరిగణలోనికి తీసుకోవడం చాలా ముఖ్యమైన అంశం. దశల వారీగా జరిగే అభివృద్ధిలో బలమైన నిర్మాణం ద్వారా నిజమైన సహకార సంఘాలను ఏర్పాటు చేయడానికి దోహదపడింది. 5శాతం పొదుపు తప్పనిసరిగా పెట్టుబడిగా ఉంచడం, సంఘంలో కనీస అర్హతల్ని పాల సరఫరాలో 180 రోజుల పాటు 180 లీటర్లుగా ఉంచడం, బలమైన అంతర్గత లెక్కల పరిశీలన పద్ధతిని ఏర్పాటు చేసుకోవడం చేసింది. దీనికి చట్టబద్ధత కల్పించుకోవడం ద్వారా లావాదేవీల్లో బహిర్గతం, బాధ్యతాయుతంగా ఉండటం, మిగులును సభ్యులు జరిపిన లావాదేవీల దామాషా ప్రకారం పంచడం ద్వారా అభివృద్ధిని సాధించింది.

పాల కేంద్రాన్ని సందర్శించిన ప్రజాప్రతినిధులు:

–20 డిసెంబర్ 2005	మెదక్ జిల్లా దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి.
–27 ఫిబ్రవరి 2006	పొన్నం ప్రభాకర్, ఏపి మార్క్ ఫెడ్ ఛైర్మన్.
–17 సెప్టెంబర్ 2009	ఎన్ రఘువీరారెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి.
–27 మే 2007	జి.చిన్నారెడ్డి, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి.
–18 నవంబర్ 2007	వసంత నాగేశ్వర్‌రావు, అప్కాబ్ ప్రెసిడెంట్.
–26 నవంబర్ 2009	జూపల్లి కృష్ణారావు, పౌరసరఫరాల శాఖ మంత్రి.
	దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉన్నత విద్యాశాఖ మంత్రి.
–16 సెప్టెంబర్ 2010	శిల్పామోహన్‌రెడ్డి,గృహ నిర్మాణశాఖ మంత్రి.
–23 ఆగష్టు 2009	కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నల్గొండ జిల్లా భువనగిరి ఎంపి.
–14 సెప్టెంబర్ 2012	ఇఎస్ఎల్ నరసింహన్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్.
	పొన్నాల లక్ష్మయ్య, ఐటి మంత్రి. శ్రీధర్‌బాబు,
	పౌరసరఫరాల మంత్రి, కాసు వెంకటక్రిష్ణారెడ్డి,
	సహకారశాఖ మంత్రి. ఆరెపల్లి మోహన్, ప్రభుత్వ విప్.
	కెడిసిసిబి అధ్యక్షుడు కొండూరి రవీందర్‌రావు.

అధికారులు:

–15 అక్టోబర్ 2006	సురేందర్‌కుమార్ జత్తార్, ఇఫ్‌కో ఛైర్మన్
–14 మే 2007	సిహెచ్ అప్పారావు, ఆప్కాబ్ ఎండి
–13 జులై 2011	పి.మోహనయ్య ,సిజిఎం నాబార్డు
–23 డిసెంబర్ 2011	ఐఎస్ఎస్ నగేశ్, సహకార శాఖ కమిషనర్
–07 జనవరి 2012	వి.ఉషారాణి, వ్యవసాయశాఖ కమిషనర్
–14 సెప్టెంబర్ 2012	స్మితా సబర్వాల్, కలెక్టర్ కరీంనగర్
–02మే 2013	కె.మధుసూదనచారి, వ్యవసాయ శాఖ కమిషనర్
–22 ఆగష్టు 2013	సందీప్‌కుమార్ సుల్తానియా, సహకార శాఖ కమిషనర్

మహిళలే ఉద్యోగులు..

ముల్కనూర్ మహిళా సహకార డెయిరీ గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమను పెంపొందించి వారి ఆర్థిక లాభాలకు చేయూతన్విడమే కాదు. స్థానికులకూ ఉపాధి అవకాశాలు కల్పించడంలోనూ ముందే ఉంది. డెయిరీలో 80 మంది శాశ్వత ప్రాతిపదిక ఉద్యోగం చేస్తున్నారు. ఇందులో 90 శాతం మహిళలే. అటెండర్ నుండి అకౌంటెంట్ వరకు అందరూ వారే. పెద్ద యంత్రాలు జరిపేందుకు తప్ప ఎక్కడా మగవారిని నియమించలేదు. ఇది కూడా మహిళా ఉద్యమానికి స్ఫూర్తిగానే చెప్పొచ్చు. సొంతంగా పశువైద్యులు, సాంకేతిక నిపుణులున్నారు. పరోక్షంగా 500 మంది డెయిరీపై ఆధారపడి జీవిస్తున్నారు. గ్రామస్థాయి సంఘాల్లో మహిళలు సిబ్బందిగా పనిచేస్తూ సంఘాలకు, పరిమితి మించి సమన్వయాన్ని ఏర్పరిచి, సమర్థవంతంగా విధులను నిర్వర్తించడంలో తమదైన ముద్ర వేశారు. డెయిరీ ప్రారంభం నుండే గ్రామ స్థాయిలో ఆధునిక పద్ధతులు (ఎలక్ట్రానిక్ మిల్క్ టెస్టర్, వేయింగ్ యంత్రం) అందుబాటులో ఉంచుకోవడం, తద్వారా సభ్యులకు నమ్మకం పొందడం ద్వారా అభివృద్ధి పథంలో వెళ్లడం. వ్యూహాత్మకంగా అమలవుతున్న పెద్ద రాబడిని సభ్యులకు పంపిణీ చేయడం, డెయిరీ ప్రతి వంద రూపాయల అమ్మకాల్లో 88 రూపా యలను తిరిగి అందించడం, జాతీయ పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ రూపొందించి, అమలు చేసిన ఆపరేషన్ ఫ్లడ్‌ను, పరిస్థితులకు అనుగుణంగా మార్చి తయారు చేసుకున్న బ్లూ ప్రింటుతో నిర్వహించడం సిబ్బంది అంకితభావాన్ని తెలియజేస్తోంది. సాంకేతిక అభి వృద్ధిలోనూ డెయిరీ ముందంజలోనే ఉంది. 60 గ్రామాల్లో డెయిరీకి ఉన్న సొంత భవనాల్లో కంప్యూటర్లు ఉన్నాయి. గ్రామాల నుంచి డెయిరీకి పాలు రాగానే ఆయా డైరెక్టర్లకు సెల్‌ఫోన్‌లో మెసేజ్ వెళ్లే టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు.

డెయిరీ సేవలు..

పాడి పశువుల బీమా. 50శాతం పాడి పశువుల మందుల కోసం సబ్సిడీగా అందించడం.50 శాతం సబ్సిడీతో కృత్రిమ గర్భధారణ కార్యక్రమం. 50శాతం సబ్సిడీతో మేలు రకాల గడ్డి గింజల సబ్సిడీ. 50కిలోల దాణ బస్తాకు 25 రూపాయల చొప్పున సబ్సిడీ. సభ్యుల కుటుంబాలకు సహజ మరణానికి 20వేల రూపాయల బీమా. సభ్యుల కుటుంబాలకు ప్రమాద మరణానికి 50వేల రూపాయలు బీమా. సభ్యులు మరణిస్తే దహన సంస్కారాలకు వారి కుటుంబానికి 2వేల రూపాయలు అందించడం. బర్రెలు, ఆవులు, కొనుగోలు చేసేందుకు సభ్యులకు డెయిరీ ద్వారా రుణ సహాయం. పాల కేంద్రాల్లో పోసిన పాలద్వారా వచ్చిన ఆదాయంతో ప్రతినెలా వాటాల పద్ధతిలో సభ్యులు రుణాలు తిరిగి చెల్లించడం. బర్రెలు, ఆవులకు బీమా సదుపాయం, పౌష్టికాహారం, వైద్య సేవలందించడం.పశువుల రోగనిరోధక టీకాలు, నట్టల మందు ఉచితంగా పంపిణ. సభ్యుల పిల్లలకు ఏటా వెయ్యి రూపాయల చొప్పున ఉపకారవేతనాలివ్వడం. ఉత్తమ సంఘాలను ఎంపిక చేసి ప్రతి ఏడాది ప్రోత్సాహక బహుమతులు అందించడం.

మెయిల్: ajay.praja9@gmail.com

సంగీతం

దక్షిణ భారత నైటింగేల్

గంధర్వగానం, పసిపాప నవ్వు ఆమె సొంతం. నగుమోము అనే పదం ఈమె నవ్వును చూశాకే పుట్టిందేమో అనిపిస్తుంది. ఆమె కంఠం నుండి వెలువడిన పాటలు వింటూ మైమరచిపోవాల్సిందే. తన గానమాధుర్యంతో అశేష శ్రోతలను తన అభిమానులను చేసుకున్న ఆమే దక్షిణ భారత నైటింగేల్ కె.ఎస్.చిత్ర. ఆమె గొంతులో చేరిన పాట ఏదైనా సరే అది గంధర్వ గానమౌతుందని సినీ సంగీత ప్రియులందరూ ఒప్పుకునే నిజం. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే ఆమె స్వభావం చూపరులను ఆకట్టుకోవడమే కాదు, అభిమానులుగా కూడా చేస్తుంది.

కేవలం పాటలు పాడటానికే పుట్టిందేమో అనిపించేంత గొప్పగా ఉంటుంది ఆమె గాత్రం. 1963, జులై 27న కేరళలోని తిరువనంతపురంలో పుట్టారు చిత్ర. తండ్రి శ్రీ కృష్ణన్ నాయర్ స్కూల్ హెడ్ మాస్టర్. వేదికలపై లలిత సంగీతం కచేరీలు కూడా చేసేవారు. ఆయనే చిత్రకు శాస్త్రీయ సంగీతంలో తొలి గురువు. తల్లి శాంత ఉపాధ్యాయని. వీణా విద్వాంసురాలు. కానీ బయట ఎక్కడా పాడేవారు కాదు. ఇంటి దగ్గరే సంగీత పాఠాలు చెప్పేవారు. చిత్ర సంగీతంలో పి.జి రెండో సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే సమయంలో, ఇళయరాజా సంగీత దర్శకత్వంలో అవకాశం వచ్చింది. ఆ సమయంలో శ్రేయోభిలాషుల సలహా మేరకు పాట పాడటానికే మొగ్గు చూపారు.

1979లో మొదటిసారి 'అట్టహాసం' అనే మలయాళ చిత్రంలో ఓ పాటకి కోరస్ పాడటానికి చిత్రసీమలోకి అడుగుపెట్టారు చిత్ర. తర్వాత నేపథ్యగాయనిగా మారారు. నాటి నుండి నేటి వరకు అలుపెరగకుండా వివిధ భాషల్లో పాడుతూనే ఉన్నారు. తనకొచ్చిన ఒక్క అవకాశాన్ని కూడా వదులుకోకుండా సద్వినియోగం చేసుకున్నారు. దీనికి ఆమె తండ్రి ప్రోత్సాహం కూడా ఎంతో ఉంది. ఓకల్ క్యాన్సర్‌తో బాధపడుతూ కూడా కూతురు భవిష్యత్తు కోసం చిత్ర వెంట నీడలా నడిచి ప్రోత్సహించారు.

1985లో తమిళ సినిమా 'సింధుభైరవి'లో "పాడలేను పల్లవైనా భాషరాని దానను" అంటూ ఏ క్షణాన పాడారో గానీ, అప్పటి నుండి ఆమె పాడిన ఏ భాష పాటైనా సరే... ఈ పాట చిత్ర పాడితే ఎంత బాగుంది అనిపించుకున్నారు. ఈ పాటలో ఉపయోగించిన మృదంగం, వయొలిన్, తంబుర వాయిద్య పరికరాలతో సమానంగా తన గొంతును శృతి చేసుకున్నారు. ఇదే పాట తెలుగులోనూ పాడారు. సత్యం గారి సంగీత దర్శకత్వంలో 'ప్రళయం' చిత్రంలో చిన్న హమ్మింగ్ పాటతో తెలుగు చిత్ర రంగంలో అడుగుపెట్టారు.

ఘంటసాల తర్వాత అంత మృదుగంభీరంగా ఉండే గాత్రం మళ్ళీ వినలేం అని చాలామంది సంగీతాభిమానులు అనుకుంటారు. కానీ సుశీల, జానకిలు ఇప్పుడు పాడటం లేదు అనే భావన సంగీతాభిమానుల్లో రాలేదంటే, దానికి కారణం చిత్ర తీయని కంఠస్వరమే. సుశీల గాత్రంలోని లాలిత్యం, జానకి గాత్రంలోని చిలిపితనం... ఈ రెండూ చిత్ర పాటల్లో కనిపిస్తాయి.

మలయాళం సినిమా పాటల్లో మెలొడీకి ప్రాధాన్యం ఉంటుంది. అదే తెలుగు పాటలో అయితే ఎక్స్‌ప్రెషన్‌కి ప్రాధాన్యం ఇస్తారు. ఇలా వైవిధ్యంగా ఉండే ప్రాంతాల్లోని చిత్ర రంగాల్లో సైతం తన పాటలతో జనాన్ని మెప్పించారు.

"సింధూరపువ్వా తేనె చిందించరావా" (సింధూరపువ్వు), "నిన్ను కోరీ వర్ణం" (ఘర్షణ), "పూసింది పూసింది పున్నాగ" (సీతారామయ్య మనవరాలు), "తూరుపు సింధూరపు బహుదూరపు" (అల్లరి పిల్ల), "జల్లంత కవ్వింత రావాలిలే", "ఓ పాపా లాలి" (గీతాంజలి), "మెల్లగ మెల్లగా తట్టి మేలుకో మేలుకోమంటూ తూరుపు వెచ్చగా చేరంగ" (ఆశ ఆశ ఆశ), "ఎవరు రాయగలరూ" (అమ్మరాజీనామా), "విరిసినది వసంతగానం వలపుల పల్లవిగా" (భైరవద్వీపం), "మరల తెలుపన" (స్వయం వరం), "మనసున ఉన్నది చెప్పాలనున్నది" (ప్రియమైన నీకు), "తెలుసునా తెలుసునా" (సొంతం), "ఏదో ఒక రాగం పిలిచిందీ ఈ వేళా నాలో నిదురించే గతమంతా కదిలేలా" (రాజా), "నీ శ్వాసలో చేరితే గాలి గాంధర్వమౌతున్నదో" (నేనున్నానని), "ఇన్నాళ్లకు గుర్తొచ్చానా వానా" (వర్షం), "నిన్నే నిన్నే అల్లుకుని" (శశిరేఖా పరిణయం), "గాలీ చిరుగాలీ నిను చూసిందెవరమ్మా" (వసంతం), "మౌనంగానే ఎదగమనీ" (నా ఆటోగ్రాఫ్), "సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు సిరిమల్లె చెట్టేమో విరగబూసింది" (సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు)... అలా పాటలే ఆమె జీవితం అన్నట్లుగా సాగుతున్నారు. రోజు రోజుకీ ఆమె గాత్రంలోని మాధుర్యం పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. చిత్ర మొదట్లో పాడిన పాటలతో పోల్చి ఇప్పటి పాటలను గమనిస్తే గొంతులో ఎంతో పరిపక్వత కనిపిస్తుంది.

తన పాటలతో ఉత్తరాదిని మైమరపించి, దక్షిణాదిని సమ్మోహన పరిచి, మధురగానానికి మారుపేరయ్యారు చిత్ర. మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ, ఒరియా, హిందీ, అస్సామీ, బెంగాలీ ఇలా... అన్ని భాషల్లో, అన్ని రకాల పాటలూ పాడారు చిత్ర. ఉత్తమ మహిళానేపథ్యగాయనిగా ఆరు జాతీయ పురస్కారాలు అందుకున్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం నుండి 15, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుండి 7, తమిళ రాష్ట్ర ప్రభుత్వం నుండి 4, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నుండి 3 అవార్డులను అందుకున్నారు. ఎన్నో వేల కొద్ది సినిమా పాటలే కాదు, శాస్త్రీయ, లలిత గీతాలు కూడా పాడుతున్నారు. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ... ఇలా దక్షిణ భారతదేశంలోని అన్ని ప్రభుత్వాల నుండి అనేక అవార్డులను అందుకున్న ఏకైక గాయని చిత్ర.

- బి.మల్లేశ్వరి

బిషప్ శవపేటికలో గర్భస్థ శిశువు!



బిషప్ పీడర్ మమ్మీని సమాధి నుండి బయటికి తీస్తున్న దృశ్యం

బిషప్ పీడర్ విన్‌స్ట్రప్ పోర్ట్రెయిట్



సి.టి.స్కాన్ దృశ్యం



గర్భస్థ శిశువు అస్థిపంజరం

బిషప్ పీడర్ మమ్మీ

స్వీడన్‌లో ఉన్న లుండ్ కెథెడ్రల్‌లో మూడున్నర శతాబ్దాల క్రితం ఓ బిషప్ పార్థివ శరీరాన్ని సమాధి చేశారు. ఆ బిషప్ పేరు పీడర్ విన్‌స్ట్రప్. సమాధి చేసే ముందు శవాన్ని మమ్మీ రూపంలోకి మార్చారు. బిషప్ పార్థివ దేహాన్ని పరిశోధన నిమిత్తం శాస్త్రవేత్తలు బయటికి తీశారు. అంతకు ముందు ఒకసారి 1920లో బయటికి తీసినా పెద్దగా పరిశోధన చెయ్యకుండానే తిరిగి సమాధి చేశారు. 2015 జూన్‌లో లుండ్ యూనివర్సిటీ పరిశోధకులు బిషప్ సమాధిని తెరచి మమ్మీని బయటకు తీశారు. బిషప్ దేహానికి ఉన్న బట్టలు మాసిపోవడం తప్ప దేహం చెక్కు చెదరకపోవడాన్ని శాస్త్రవేత్తలు ఆశ్చర్యంగా చెప్పుకుంటున్నారు. అంతే కాదు అసలు ఈ మమ్మీ మిస్టరీ తెలుసుకోవాలంటే స్కాన్ తియ్యాలనే ఆలోచన చేశారు. అందుకే సీటీ స్కానర్స్ ద్వారా స్కాన్ తీశారు. ఫలితంగా దేహం లోపల ఉన్న అవయవాలు చెక్కు చెదరకుండా అలాగే ఉన్నాయని గ్రహించి శాస్త్రవేత్తలు ఆశ్చర్యపోయారు. సాధారణంగా ఒక మృతదేహాన్ని మమ్మీగా చెయ్యాలంటే శవం లోపల ఉన్న పేగులు, ఇతర అంతర్గత అవయవాలను తొలగిస్తారు. కానీ ఈ బిషప్‌కు అలా చెయ్యలేదు. అయినా బిషప్ మమ్మీ చెక్కుచెదరకపోవడం విశేషం.

అలాగే ఆయన శరీరం రూపు మారకుండా అలాగే ఉండటాన్ని గమనించారు. ఆయన బతికి ఉన్న కాలంలో చిత్రించిన చిత్రాలతో పోల్చి రూపం మారలేదనే నిర్ధారణకు వచ్చారు.

ఇంతకు ఎవరీ బిషప్?

బిషప్ పీడర్ విన్‌స్ట్రప్ 1605లో జన్మించి 1679లో మరణించారు. ఈయన లుండ్ చర్చికి బిషప్‌గా ఉండేవారు. అప్పట్లో అది డెన్మార్క్ సామ్రాజ్యంలో భాగమైన స్వీడన్ రాజ్యంలో ఉండేది. బిషప్ పీడర్ సమకాలీన యూరప్‌లో పేరుగాంచిన థియొలాజియన్. స్వీడన్ రాజును ఒప్పించి లుండ్ యూనివర్సిటీని స్థాపించడానికి కృషిచేశాడంటారు. అంతేకాదు ఆయన ఆ యూనివర్సిటీకి ఛాన్సలర్‌గా కూడా వ్యవహరించారు. ఆయన ఛాన్సలర్‌గా పనిచేసిన యూనివర్సిటీ పరిశోధకులే దాదాపు 350 ఏళ్ళ తరువాత ఆయన మమ్మీపై పరిశోధనలు చేస్తున్నారు.

బయటపడిన రహస్య గర్భస్థ శిశువు

బిషప్ పీడర్ మమ్మీని స్కాన్ తీస్తున్న శాస్త్రవేత్తలకు శవపేటికలో ఆయన కాళ్ళ కింద ఒక మృతశిశువు అవశేషాలు కనిపించాయి. దీన్ని అయిదారు నెలల గర్భస్థ శిశువుగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ శిశు దేహం బిషప్ శవపేటికలోకి ఎలా వచ్చిందనేదే ఇప్పుడు సైంటిస్టులను వేధిస్తున్న ప్రశ్న. గర్భస్రావం ఫలితంగా ఈ శిశువు మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. బాప్టిజం తీసుకోని వారిని క్రైస్తవ సాంప్రదాయం ప్రకారం ఖననం చెయ్యడానికి ఒప్పుకునేవారు కాదని, అందువల్ల ఎవరో చనిపోయిన తన శిశువును రహస్యంగా బిషప్ పీడర్ శవపేటికలో ఉంచి అత్యున్నత గౌరవం, మర్యాదతో ఖననం అయ్యేలా చేశారని కొందరు అంటున్నారు. మరి కొందరు ఈ శిశువు ఆయన రక్త సంబంధీకులదేమోననే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బిషప్‌తో ఈ శిశువుకు ఉన్న సంబంధాన్ని గుర్తించేందుకు డిఎన్ఎ టెస్ట్ చెయ్యబోతున్నట్లు లుండ్ యూనివర్సిటీ పరిశోధకులు ప్రకటించారు. ఈ పరీక్ష పూర్తయి ఫలితాలు వస్తే కానీ గర్భస్థ శిశువు మిస్టరీ విడివడేలా లేదు.

\- భూపేంద్ర





మేరీ చిహా హదాద్
(1898 - 1973)





కొత్త కుంచెలో పాత ప్రపంచం

చరిత్ర చాలా చిత్రమైంది. మరచిపోయిన గతాన్ని యుగాల విరామం తర్వాత సరికొత్తగా పునరావృతం చేసి విభ్రమం గొలుపుతుంది. మేరీ చిహా హదాద్ చిత్రాలు కూడా మనల్ని ఆశ్చర్యచకితం చేస్తాయి. పురాతన సమాజపు ఆడవాళ్లు తమ కళపై సంతకం చేయకుండానే వెళ్ళిపోగా, మేరీ సంతకం చేసిన తన కేన్వాసులతో ఒక పాత ప్రపంచపు ఉనికిని అనితరసాధ్యంగా పరిచయం చేసి వెళ్ళిపోయింది. ఆమె బొమ్మ కట్టిన లెబనాన్ ప్రకృతి, ప్రాచీన నాగరికతకు కొనసాగింపుగా సాగుతున్న అక్కడి ప్రజాజీవితం... కాలాతీతమైన మానవ సంవేదనను నిత్యనూతనంగా మనముందుంచుతాయి.

మేరీ హదాద్ బీరుట్‌లో సంపన్న బ్యాంకర్ల కుటుంబంలో పుట్టింది. తన కాలం ఆడవాళ్ళకు భిన్నంగా కళాప్రపంచంలోకి తొంగిచూసింది. 1920లలో తొలుత బీరుట్‌లో, తర్వాత ప్యారిస్‌లో బొమ్మలు నేర్చుకుంది. ఆమెకు అప్పటికే పెళ్ళయి ముగ్గురు కూతుళ్ళున్నారు. తొలుత కాలక్షేపం కోసం బొమ్మలు వేసినా నెమ్మదిగా లెబనాన్ జనహృదయపు లోతుల్లోకి వెళ్ళిపోతూ వాటిని కేన్వాసులపైన ప్రతిబింబించింది. సంచార, కొండజాతులను, వాళ్ళ దైనందిన జీవన వ్యాపారాలను ముదురు రంగుల్లో సుఖదు:ఖాలు మేళవించిన రాగంలో ప్రదర్శించింది.

కళపై పాశ్చాత్య కళాకారులు పెత్తనం చెలాయిస్తున్న 30, 40 దశకాల్లో మేరీ తన చిత్రాలను లండన్ నుంచి న్యూయార్క్ వరకు ఎన్నో పాశ్చాత్య నగరాల్లో ప్రదర్శించి కొత్త లోకాన్ని పరిచయం చేసింది. లెబనాన్ సంస్కృతీ సంప్రదాయాలను, పురుషాధిపత్య ఉక్కుపాదాల కింద నలిగిపోతున్న అతివల ప్రపంచాన్ని గుండెబరువుతో కళ్ళకు కట్టింది.

– వికాస్

శిలాఫలాలు తి

ఆరోగ్య రక్షణలో పండ్లు కీలకపాత్ర పోషిస్తాయి. పండ్లు పోషక
అవసరమైన ఇతర రసాయనాలు, పోషక పదార్థాలను పుష్కలంగా క
ముఖ్యపాత్ర పోషిస్తున్నందున డాక్టర్లు సైతం వివిధ అనారోగ్య
ఉన్నవారికే కాక ఆరోగ్యవంతులూ వీటిని ఎలాంటి సందేహం లేకుం
సలహా మేరకే తినాలి. అప్పుడే శిలాఫలాల ద్వారా పూర్తి ప్రయోజ
వుండే పోషకాలు, ఆరోగ్య రక్షణలో వాటి పాత్ర గూర్చి తెలుసుకుం

బాదం : ఏడాదిపాటు రోజూ గుప్పెడు బాదం తినడం వల్ల భవిష్యత్తులో గుండె జబ్బులు దరిచేరకుండా వాటిని ఆమడదూరంలో నిలబెట్టవచ్చు. స్పెయిన్‌లోని ఓ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు తాజాగా నిర్వహించిన అధ్యయనం ప్రకారం రోజూ ఏదో ఒక రూపంలో బాదం తినడం వల్ల గుండె జబ్బుల్ని రాకుండా చూడవచ్చు. వీటిలో ఉండే పీచు పదార్థం, విటమిన్ -ఇ, అన్ సాచురేటింగ్ ఫ్యాట్ అందుకు దోహదం చేస్తాయి. ముఖ్యంగా పొట్ట ప్రాంతంలో పేరుకునే కొవ్వును కరిగించి, తద్వారా గుండె జబ్బుల్ని దూరంగా ఉంచుతాయి. బాదంను ప్రత్యామ్నాయంగా వాడితే మంచి ఫలితాలు సాధ్యం. ఎందుకంటే వీటిని తిన్న వెంటనే పొట్టనిండిన భావన కలుగుతుంది. నానబెట్టి తింటే ఇంకా మంచి ఫలితాలు వస్తాయి.

ఆక్రోట్లు (వాల్‌నట్లు) : ఆక్రోట్ పప్పులు గుండెతో సహా శరీరంలోని రక్త నాళాలన్నీ ఆరోగ్యంగా ఉంచి రక్త సరఫరా సాఫీగా జరిగేలా చేస్తాయి. వయసు మీరుతున్న కొద్దీ ధమనులు చక్కని ఆరోగ్యంతో పనిచేయాలంటే, అవి చక్కగా వ్యాకోచిస్తూ, రక్త ప్రసరణలో ఎలాంటి అడ్డంకులూ కలిగించకుండా ఉండాలి. దీనికోసం నైట్రిక్ ఆసిడ్ అవసరం ఉంటుంది. ఆక్రోట్ పప్పుల్లో ఉండే అమైనో ఆసిడ్ ఆర్గినైన్, ధమని గోడలపై నైట్రస్ ఆక్సైడ్‌ను విడుదల చేసి, ధమనుల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది దరిదాపుగా వయాగ్రా మాత్రల్లా పనిచేస్తాయి. ఆక్రోట్లలో ఇతరత్రా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఆరోగ్యానికి మేలు చేసేవే. అవి కొవ్వు పదార్థాలు తీసుకున్న తర్వాత ధమనుల్లో తలెత్తే వాపు వంటి సమస్యల నుండి ధమని గోడల్ని రక్షిస్తాయి. దీనిలో గల ఒమెగ్రా త్రీఫ్యాటీ ఆమ్లాలు మెదడును చురుగ్గా ఉంచుతాయి. ఫలితంగా మెదడు పనితీరు బాగుంటుంది. వీటిలో ఉండే టోకోఫిరాల్ అనే పదార్థానికి గుండె జబ్బుల నుంచి శరీరాన్ని రక్షించే శక్తి ఉంది. శరీరంలోని ట్రైగ్లిసరైడ్లని నియంత్రణలో ఉంచుతాయి. రక్త ప్రసరణ సాఫీగా సాగేందుకు సాయపడతాయి. మెదడు ఆరోగ్యంగా ఉండేందుకు, చురుగ్గా పనిచేయడానికి తోడ్పడతాయి. వాల్‌నట్లను రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల వయసుతో పాటు వచ్చే మతిమరుపు సమస్యలు తగ్గుతాయి. అలసిన మెదడు సేద తీరుతుంది. మారుతున్న జీవనశైలి కారణంగా తలెత్తుతున్న రొమ్ము క్యాన్సర్, డయాబెటిస్, ఊబకాయం, గుండెజబ్బుల నుంచి రక్షించే ప్రత్యేక లక్షణాలు వాల్‌నట్లలో ఉన్నాయి. దీనిలో యాంటీ ఆక్సిడెంట్లకి జీవక్రియలను వేగవంతం చేసే శక్తి ఉంది. వీటితో పాటు ఎముకలు, కండరాలు శక్తివంతం చేసే గుణమూ అధికమే.

జీడిపప్పు : జీడిపప్పులో బోలెడు పోషకాలున్నాయి. రోజూ తీసుకోలేకపోయినా వారంలో రెండు, మూడు సార్లు దీన్ని ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల అనేక లాభాలున్నాయి. వీటిలో సహజంగా ఉండే పాలో అన్ సాచురేటెడ్, మోనో అన్ సాచురేటెడ్ కొవ్వులు శరీరానికి మేలు చేసే కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. రక్త ప్రసరణ సక్రమంగా జరిగేట్లు చేస్తాయి. గుండెనూ ఆరోగ్యంగా వుంచుతాయి. దీనిలో ఫాస్పరస్, మెగ్నీషియం, కాపర్, ట్రిఫ్టోఫాన్‌లు అధికమొత్తంలో లభిస్తాయి. వీటి నుంచి లభించే పీచు జీర్ణప్రక్రియను వేగవంతం చేస్తుంది. బరువుని అదుపులో ఉంచుతుంది. గర్భిణీలకు మేలు చేసే ఫోలిక్ ఆసిడ్, పొటాషియం, విటమిన్ 'బి' లు పుష్కలంగా ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్లు వ్యాధి నిరోధకశక్తిని పెంపొందిస్తాయి. క్యాన్సర్ కారకాలను అడ్డుకొంటాయి. రోజూ చిన్నారులకు నాలుగైదు జీడిపప్పు పలుకుల్ని ఆహారంలో భాగంగా ఇస్తే మెదడు చురుగ్గా పనిచేస్తుందని అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఎముకలు బలంగా తయారవుతాయి. నట్స్‌లో సాధారణంగా లభించే లినోలినిక్ యాసిడ్లు ఒత్తిడిని దూరం చేస్తాయి. జుట్టు, చర్మం ఆరోగ్యంగా, అందంగా పెరగాలనుకునేవారు తరచూ జీడిపప్పుని తింటే మంచి ఫలితం లభిస్తుంది. నిద్రలేమి సమస్యకు చక్కని పరిష్కారం చూపుతాయి.

పిస్తా : పిస్తాలో విటమిన్ ఎ,సి, బి6 ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. వీటిని రుచి కోసం సలాడ్లు, ఐస్‌క్రీములు, తీపి పదార్థాలపై చల్లుకున్నా బాగుంటాయి. పిస్తాలోని పొటాషియం శరీరంలోని ద్రవాలను తుల్యం చేస్తుంది. రక్తపోటును నిరోధించడంలో పిస్తా చేసే మేలు మరువలేనిది. దీనిలోని విటమిన్ బి6 మెటబాలిజం (జీవక్రియలు) బాగుండేలా చూస్తుంది. పిస్తాలో లభించే 'విటమిన్ ఇ' ఊపిరితిత్తుల క్యాన్సర్ బారి నుండి కాపాడుతుంది. ప్రతిరోజూ పిస్తా తినడం వల్ల కొలెస్ట్రాల్ తగ్గి గుండెకు మేలు జరుగుతుంది. అదే సమయంలో క్యాన్సర్‌ని నివారిస్తుంది.

ఆప్రికాట్లు : రక్తహీనత ఉన్నవారు ఆప్రికాట్లు తింటే మంచిది. ఐరన్, ఇతర ఖనిజాలు ఆప్రికాట్లు నుండి అధికంగా లభిస్తాయి. స్కిన్ ఫెయిర్‌నెస్‌కు కూడా ఆప్రికాట్లు దోహదం చేస్తాయి.

వేరుశెనగలు : వేరుశెనగ, దానికి సంబంధించిన ఉత్పత్తుల్లో కొలెస్ట్రాల్ ఉండదని తాజా పరిశోధనలు చెబుతున్నాయి. ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు, ప్రొటీన్లు, ఫోలిక్ యాసిడ్లు పుష్కలంగా ఉన్నాయి. గుప్పెడు వేరుశెనగలు తినడం వల్ల మనకు రోజులో

...తింటున్నారా?

...పదార్థాల నిలయాలు. విటమిన్లు, ఖనిజ లవణాలు, శరీరానికి ...లిగి ఉంటాయి. ఎండిన ఫలాలు (డ్రై ఫ్రూట్స్) ఆరోగ్య రక్షణలో ...పరిస్థితుల్లో తినమని చెబుతున్నారు. రోగులు, బలహీనంగా ...డా తినొచ్చు. అయితే ఏదైనా మితంగా, పోషకాహార నిపుణుల ...నం పొందొచ్చు. కొన్ని ముఖ్యమైన శిలాఫలాల్లో (డ్రై ఫ్రూట్స్) ...ాం.

అవసరమైన విటమిన్ 'ఇ'లో 25 శాతం లభిస్తుంది. రక్తంలో హానిచేసే కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి అవసరమైన మోనోఅన్‌సాచురేటిక్ ఫ్యాటీయాసిడ్, పాలీఅన్‌సాచురేటెడ్ ఫ్యాటీయాసిడ్స్ కూడా వేరు శెనగలో ఉన్నాయి.

మన దగ్గర లభిస్తున్న డ్రై ఫ్రూట్స్‌లో ఎక్కువ భాగం విదేశాల నుంచి దిగుమతి అవుతున్నవే. జీడిపప్పు (శ్రీకాకుళం), కిస్‌మిస్ (ఉత్తర భారతం), కొన్ని రకాల వాల్‌నట్ల (కాశ్మీర్)ను మినహాయిస్తే బాదం, పిస్తా, అంజీర్, ఖర్జూరాలు మొదలైనవన్నీ ఎడారి దేశాల నుండి దిగుమతి అవుతున్నాయి. వీటిలో ఒక్కొక్కటి తక్కువలో తక్కువ ఐదారు రకాల్లో లభిస్తాయి. కిస్మిస్ (7–8 రకాలు), బాదం (4 రకాలు) లభిస్తాయి. ఖర్జూరాలు ఇరాన్, ఇరాక్, యెమెన్, అల్జీరియా, సుడాన్, లిబియా, సౌదీ అరేబియా తదితర దేశాల నుంచి ముందుగా ఢిల్లీ, అమృత్‌సర్, ముంబాయ్ మార్కెట్లకు వస్తాయి. అక్కడి నుంచి దేశంలోని వివిధ ప్రాంతాల్లోని హోల్‌సేల్ మార్కెట్లకు తరలిస్తారు.

ఎండు ఫలాలు - విశేషాలు

✤ డ్రై ఫ్రూట్స్‌కు డాలర్‌కు అవినాభావ సంబంధం ఉంది. ఇవన్నీ విదేశాల నుండి దిగుమతి అవుతున్నవే. డాలర్ రేట్ పెరిగితే సహజంగానే ఆ దెబ్బ డ్రైఫ్రూట్లపై పడుతుంది. ✤ ఇండియాలోని డ్రైఫ్రూట్స్ వ్యాపారం ప్రతీ సంవత్సరం 10 శాతం అభివృద్ధి చెందుతూ, వేలకోట్ల రూపాయలకు చేరుతోంది. ప్రతి ఏడాదీ 1400 కోట్ల రూపాయల డ్రై ఫ్రూట్స్ విదేశాల నుండి దిగుమతి అవుతున్నాయి. ✤ దక్షిణ భారతదేశం మొత్తం మీద అత్యధిక అమ్మకాలు సాగించే హైదరాబాద్‌లోని బేగంబజార్‌లో డ్రైఫ్రూట్స్ మార్కెట్‌లో ఏటా 500 కోట్ల రూపాయల వాణిజ్యం సాగుతోంది. ✤ గింజ పప్పులు పోషకాల ఘనులు. గింజ పప్పులు (నట్స్) తరచుగా తినడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు దండిగా ఉంటాయి. ✤ ఎండుద్రాక్ష ఆరోగ్యానికి చేసే మేలు ఎంతో ఉంది. మలబద్ధకంతో బాధ పడుతున్న వారికి ఓ రెండు టేబుల్ స్పూన్ల ఎండుద్రాక్షలు ఓ గ్లాసు నీళ్ళలో ఓ రోజంతా నానబెట్టి ఉదయాన్నే ఆ నీళ్ళు తాగితే, ఆ నానిన పండ్లను తింటే ఆ సమస్య కాస్తా మాయమవుతుంది. ✤ ఖర్జూరాల్లో గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌లు ఎక్కువ. వారానికి రెండు సార్లు తింటే గుండె పదిలం. అలసట మటుమాయం. దీనిలో కొద్ది పాళ్ళలో ఉండే నికోటిన్ పేగులోని ఇబ్బందుల్ని తొలగిస్తుంది. ✤ స్కూల్ పిల్లలు, కాలేజీకి వెళ్ళే యువతరం, ఉద్యోగులు, గృహిణులు, వృద్ధులు, మధ్య తరగతి ప్రజలు సైతం ప్రతిరోజూ కనీసం నాలుగు డ్రైఫ్రూట్స్ పలుకులైనా నోట్లో వేసుకోవాలి. ఎండిన ఫలాల్లో ఔషధగుణాలు మెండు. ఇవి సహజమైన ఔషధాలు. శరీరానికి అవసరమైన ఖనిజాలు, విటమిన్లు, ఎంజైములు ఎండు ఫలాల్లో సమృద్ధిగా ఉంటాయని ఆయుర్వేదం చెబుతోంది. జీర్ణశక్తిని పెంచడంతోపాటు రక్తాన్ని శుద్ధి చేస్తాయి. వీటిల్లోనే యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ. ఈ యాంటీ ఆక్సిడెంట్లు హృద్రోగాల్నీ, క్యాన్సర్‌నీ, వృద్ధాప్యాన్నీ దగ్గరకు రానీయవు. అందువల్ల అందుబాటులో ఉన్న ఏ డ్రైఫ్రూట్‌నీ వదలొద్దు. కొంచెం కొంచెంగా... రోజువారీగా డ్రైఫ్రూట్స్ తినాలి. పూర్తి ప్రయోజనం పొందాలి.

డ్రైఫ్రూట్స్ పోషక విలువలు

బరువు	క్యాలరీలు	కాల్షియం	ఐరన్	మెగ్నీషియం	ఫాస్పరస్	సోడియం	పొటాషియం	కాపర్
100గ్రా	మి.గ్రా	మి.గ్రా	మి.గ్రా	మి.గ్రా	మి.గ్రా	మి.గ్రా	మి.గ్రా	మి.గ్రా
ఎండుద్రాక్ష	294	54.2	2	35	102	15.6	673	0.035
ఆప్రికోట్	260	67	5.5	62	108	26	979	---
యాపిల్	275	31	1.6	22	52	5	69	---
పీచ్	262	48	6	48	117	16	950	---
పియర్	268	35	1.3	31	48	7	579	---
ఖర్జూరం	248	68	1.6	59	64	5	750	0.21
ఫీగ్(అంజీర)	213	280	4.2	92	92	87	1010	0.24

– డా॥సమ్మెట గోవర్ధన్, 9949038471



హాయ్ గౌతమ్...

నీ లెటర్ చదివాను. ఎలా ఉన్నావు?

ఈ ప్రశ్న నిన్ను అడగాల్సింది కాదు. ఎందుకంటే నన్ను ప్రేమించినందుకు నీ హృదయం ఛిద్రమై జీవచ్ఛవంలా బతుకుతున్నావని తెలుసు.

కాని నేను అడుగుతున్నది నీ మనసుని. ఎందుకంటే మనసుకి వయసుతో పనిలేదు కదా!

ఏంటి విషయాలు...

'మన కాలేజ్ ఎలా ఉంది?' అని నేనడిగితే 'కాలేజ్ ఎప్పటికీ అలాగే ఉంటుంది. అవసరమైతే ఇంకో ఫ్లోర్ పెరుగుతుంది కానీ మనుషులే చేసిన బాసలు, ఇచ్చిన మనసులు పాతాళంలోకి దిగజారుతున్నారు.' అని నువ్వంటావ్ అందుకే డైరెక్ట్‌గా పాయింట్ కొస్తాను...గౌతమ్.

గౌతమ్.. ఐలవ్ యూ......అని నేను కాలేజీలో నీకంటే ముందే చెబుదామనుకున్నాను.

కానీ...ఏం చేయను. ఏమీ చేయలేని పరిస్థితుల్లో నేను అతడిని పెళ్లి చేసుకోవాల్సి వచ్చింది. మా కుటుంబ ఆర్థికావసరాలు తీర్చి పైగా నాకు ఎదురు కట్నం ఇచ్చి పెళ్లి చేసుకుంటాననడంతో మా ఇంట్లో నుంచి నాపై ఒత్తిడి పెరిగింది. ఆరుగురి ఆకలి ముందు నా ఇష్టాలు, నా ప్రేమ నాకు తెలియకుండానే త్యాగాన్ని కోరుకున్నాయి. త్యాగమనేది ఒకటుందనే విషయం అప్పుడే తెలిసింది. కానీ తర్వాత తెలిసిదేంటంటే మనం బతకడం కోసం మన మనసును చంపుకోవడమే త్యాగమని అర్థమైంది. పైగా ఇటువంటి ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న నీకు ప్రేమ అవసరమా అని ఎవరో అనకుముందే నాకు ప్రేమ అవసరమా? అని నన్ను నేనే విమర్శించుకున్నాను. కానీ ఇప్పుడేమనిపిస్తోందంటే ప్రతి మనిషికీ కొంచెం స్వార్థం ఉండాలి అని... అదిలేకపోతే ఇలా నాలా అనవసర త్యాగాలతో ఒక జీవితాన్ని గడిపేస్తాం. చనిపోయే చివరి నిమిషం ముందు వెనక్కి తిరిగి చూసుకుంటే నేనింటి ? నాకేంటి? నాకెవరు ? అని ఆలోచిస్తే అంతా శూన్యం తప్ప ఇంకేమీ కనిపించదు. అప్పుడు నిజంగా బాధపడుతూ చనిపోతాం...!

నీ ప్రేమని అంగీకరించకుండా ఇంకో అబ్బాయిని పెళ్లి చేసుకోవడమే జీవితంతో నేను చేసిన ఏకైక దిద్దుకోలేని తప్పు.

నాకు తెలుసు గౌతమ్! నా పెళ్లి అని నీకు తెలిసినప్పుడే నీ హృదయం ముక్కలై ఉంటుంది. ప్రతి ముక్కలోనూ నేనే ఉంటాననీ తెలుసు...అంటే నేను కూడా ముక్కలయ్యాననే కదా అర్థం. అవును అదే జరిగింది.

నేను తెల్లగా ఉంటానని నన్ను అందంగా లిల్లీ అని పిలిచావు. అలా పిలిచినప్పుడల్లా నేను ఎంతో మురిసిపోయేదాన్ని. కానీ ఇప్పుడు అందమైన పువ్వులను చూస్తే పువ్వా... పువ్వా... నువ్వు ఎందుకు పూచావు, ఒక రోజు మాత్రమే

బతికే నీకు ఎందుకింత ఆరాటం అని అడిగాలనిపిస్తోంది!

ఇప్పటికే నీకు అర్థమై ఉంటుంది. అవును... నా జీవితం సమస్యల వలయంలో చిక్కుకుంది. దీంట్లో నుంచి బయటపడడానికి నా సర్వశక్తులూ కూడగట్టుకుని ప్రయత్నిస్తాను. నా ఈ ప్రయత్నంలో నేను సమస్యల నుంచి బయటపడతానో లేక పూర్తిగా బయటకెళ్లిపోతానో తెలీదు గౌతమ్! కానీ పిరికివాళ్ల లాగ చావును మాత్రం ఆహ్వానించను. మళ్లీ నిన్ను ఎప్పుడు కలుస్తానో తెలీదు. అసలు కలుస్తానో లేదో కూడా తెలీదు. కలుస్తానో లేదో కూడా తెలీదు. ఏం (ప్రేమ) తెలియనపుడు చేసిన తప్పును అంతా (జీవితం) తెలిసిన తర్వాత తెలుసుకుంటే కళ్లకు పని చెప్పడమే అవుతుంది.

ఇంతకీ ముఖ్య విషయం ఏంటంటే.. వరణ్యను నువ్వు కేవలం ఫ్రెండ్‌గానే చూస్తున్నావ్. కానీ తను నిన్ను చాలా ఇష్టపడుతోంది, ప్రేమిస్తోంది. నువ్వు నన్ను ప్రేమించిన విషయం కూడా ఆమెకు తెలుసు. అయినా నిన్ను పెళ్లి చేసుకోవడానికి తాను సిద్ధంగా ఉంది. ఒక అమ్మాయి మనసు ఇంకో అమ్మాయికి మాత్రమే తెలుస్తుంది అంటారు. అది ఎంతవరకు నిజమో నాకు తెలీదు. కానీ వరణ్య నిన్ను బాగా చూసుకుంటుందని నా నమ్మకం.

చాలా మంది అబ్బాయిలు చేసినట్టే నీకు పాప పుడితే నాపేరు (వైశాలి) అని పెట్టుకోండి. బాబు పుట్టినా.. విశాల్ అని పెట్టుకోవచ్చు... చిన్న నవ్వు.

నవ్వు.. నవ్వంటే గుర్తొచ్చింది. ఒకప్పుడు కాలేజీలో నాకు 'బెస్ట్‌స్మైల్' అవార్డు ఇచ్చారు... నీకు గుర్తుంది కదా!

నా నవ్వు చూడ్డానికే కదా ఒకసారి నువ్ రాత్రి 12 గంటలకు నిద్రపట్టట్లేదని మా హాస్టల్‌కు వచ్చింది... అది నాకు ఇంకా గుర్తుంది. నా తుది శ్వాస వరకు కూడా గుర్తుంటుంది.

కానీ...ఇప్పుడు ఆ నవ్వే నాకు వికారంగా కనిపిస్తోంది. నలుగురూ నన్ను చూసి నవ్వడం కాదు అద్దంలో నా రూపమే నన్ను చూసి వెక్కిరింతగా నవ్వుతోంది. అయినా ఇప్పుడు నాకు నవ్వే ఓపికా లేదు. శక్తీలేదు.

ఒక్కటి మాత్రం నిజం గౌతమ్, నేను కూడా నిన్ను గాఢంగా ప్రేమించాను. నీతోనే నా జీవన ప్రయాణం అని ఎన్నో కలలుగన్నాను.

నా కలలన్నీ ఆకాశంలో నక్షత్రాల్లా ఎక్కడెక్కడో విశ్వమంతా విసిరేయబడ్డాయి. ఇప్పుడు ప్రతి రోజూ ఆ కలల్ని చూస్తూ ఏ అర్థరాత్రో నిదురపోతున్నాను.

స్వర్గం అనేది ఒకటుంది అనేది నిజమైతే నీ కంటే ముందే అక్కడికి చేరుకుని ఆ స్వర్గపు వాకిట సంక్రాంతి ముగ్గేసి ఓణి, పట్టు పరికిణీలతో నేను నీ కోసం ఎదురు చూస్తుంటాను... ఆహ్! తొందరేం లేదు. నీ కోసం ఎన్ని సంవత్సరాలైనా అలా ఎదురు చూస్తుంటాను.

ఆశ, నిరాశ, నిట్టూర్పు, నిస్పృహ, ఓర్పు, సహనం, నిరసన, ఆవేశం, అనురాగం, అభిమానం, కోపం, బాధ, దు:ఖం, ఏడుపు, నవ్వు, సుఖం, సంతోషం...ప్రేమ ఇంకా ఎన్ని ఉన్నాయో తెలీదు కానీ ఇవన్నీ కలిస్తేనే జీవితమనేది పూర్తవుతుందని అనిపిస్తోంది.

అందుకే జీవితానికి నేను ఇస్తున్న నిర్వచనం ఒక విషాదం...!

కానీ అనుభవిస్తే అందులోనూ ఒక సంతోషం (ప్రేమ) ఉంటుందని తెలుసుకోవచ్చు.

నువ్ అన్నావ్...

'ఒక అబ్బాయి తన జీవిత కాలంలో ఒకమ్మాయినే ప్రేమిస్తాడు... ఆమె వేశ్య అయినా సరే' అని ఒక వేళ అదే నిజమైతే ఈ ప్రపంచంలో ప్రేమించబడే అమ్మాయిలంత అదృష్టవంతులెవరూ ఉండరు...నాతో కలిపి !అసలు అబ్బాయిలు ఇంత దారుణంగా ప్రేమిస్తారా అని అనకుండా ఉండలేక పోతున్నాను



గౌతమ్...! చివరగా ఒకే మాట

నీ మీద అంతంలేని నా ఈ అంతులేని ప్రేమను ఏ యుగాంతం ఆపలేదు.

నన్ను ఒక మాజీ ప్రేమికురాలు అనే ఒక జ్ఞాపకంలా కాకుండా కనీసం ఒక స్నేహితురాలు అనే భావనగానైనా గుర్తుపెట్టుకుంటావని ఆశిస్తూ నీ ప్రేమికురాలు... **వైశాలి**

ఐదేళ్ల తర్వాత...

గౌతమ్ బీచ్‌లో నిలబడి సముద్రపు హోరు వింటూ...దూరంగా ఆకాశం, సముద్రం కలిసే చోటు వైపే చూస్తున్నాడు. ఆ హోరులో ఎక్కడైనా వైశాలి రూపం కనిపిస్తుందేమోనని !

ఒక్కసారిగా...

'గౌతమ్... ఐలవ్‌యూ... నేను నీ వైశాలిని....

నేను కూడా నీ దగ్గరికి వచ్చేస్తున్నా...'

అంటూ గౌతమ్ ఐదేళ్ల కూతురు వైశాలి కొంచెం దూరం నుంచి అరుస్తూ పరుగెత్తుకొస్తోంది...

– నాగన్ చిల్ల, 90598 94711,

nagan706@gmail.com

రాజనీతి కుశల సంగం లక్ష్మీబాయి

మహిళా, శిశు సంక్షేమానికి పాటుపడిన సంఘ సేవకురాలు, విద్యావేత్త, రాజకీయ నేత అయిన సంగం లక్ష్మీబాయి సీతమ్మ, దొంత రామయ్య యాదవ్ దంపతులకు 1911 జులై 27 న ఘట్‌కేసర్ ప్రాంతంలో జన్మించారు. బాల్యంలోనే వివాహమైన లక్ష్మీబాయి భర్త, తండ్రి మరణంతో అనాథ అయ్యింది. మాడపాటి సలహాతో గుంటూరు శారదానికేతనంలో హిందీ విద్వాన్ (1927) పాసై మద్రాసు ఆంధ్రమహసభలో చిత్రకళలో డిప్లొమా (1933-38) పొందింది. కార్వే విశ్వవిద్యాలయం నుంచి ప్రైవేట్‌గా బి.ఏ. డిగ్రీ సాధించింది. గుల్బర్గా బాలికా పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పని చేసి 1938-46 మధ్య నారాయణగూడ బాలికల హాస్టల్ వార్డెన్‌గా కొనసాగింది.

స్వాతంత్ర్యోద్యమ ప్రభావంతో ఉన్నవ లక్ష్మీబాయమ్మ వంటి వారితో కలిసి ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న లక్ష్మీబాయి విదేశీ వస్తు బహిష్కరణ మున్నగు సత్యాగ్రహాలు చేబట్టి 1930లో రామ వెల్లూరు జైలులో శిక్షననుభవించింది. అక్కడ దుర్గాబాయమ్మ మొదలగు వారు సహచరులుగా ఉన్నారు. జైలులో ఉన్నప్పుడే స్త్రీల కోసం ప్రత్యేక కారాగారాలు ఏర్పాటు చేయాలని పోరాడింది. 1932లో శాసనోల్లంఘనంలో పాత్ర వహించి మళ్లీ ఒక సంవత్సరం పాటు జైలుశిక్షకు గురైంది. 1947లో తెలంగాణ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని ఉద్యోగానికి రాజీనామా చేసింది. రజాకార్లు షోయబుల్లా ఖాన్‌ను దారుణంగా హత్య చేసినపుడు అతని ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చడమే కాకుండా నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమావేశాలు నిర్వహించింది. 1950లో వినోబాభావే భూదాన యజ్ఞయాత్రలో పాల్గొని రెండు నెలలపాటు ఆయన వెంట ఊళ్ళు తిరిగి ఉపన్యాసాలొసగింది. 1953లో 16 గ్రామాలు తిరిగి నలభై ముగ్గురి నుండి 314 ఎకరాల భూమిని సాధించింది.

ప్రజాసేవాతత్పరురాలైన సంగం లక్ష్మీబాయి హైదరాబాద్ రాష్ట్రంలో జరిగిన తొలి ఎన్నికల్లో (1952) ఎం.ఎల్.ఏ.గా నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నుండి గెలుపొందింది. బూర్గుల రామకృష్ణారావు మంత్రి వర్గంలోని విద్యాశాఖలో డిప్యూటీ మినిష్టర్‌గా(1954-56)లో ఉండి విద్యారంగాభివృద్ధికి, స్త్రీ విద్యకు పాటుపడింది. 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రం నుంచి తొలి మహిళా ఎం.పీ.గా 1957 ఎన్నికల్లో వికారాబాద్ నుంచి భారీ మెజారిటీతో ఎన్నికైన రాజనీతికుశల లక్ష్మీబాయి. తర్వాత 1962, 67లలో కూడా గెలుపొంది 14 సంవత్సరాలు పార్లమెంట్ సభ్యురాలిగా తన సేవలు అందించింది.

నిరుపేద స్త్రీలకు ఉచితంగా విద్య, ఉపాధి ఏర్పాటు చేయాలన్న సేవాతత్పరతతో 1952లో మలక్‌పేటలోని తన ఇంట్లో నలుగురు పిల్లలతో 'స్త్రీ సదనం' ప్రారంభించి మరుసటి సంవత్సరమే సైదాబాద్‌లోని తన రెండెకరాల స్థలంలో 'ఇందిరా సేవాసదన్' స్థాపించింది. దీనికి ఇందిర పేరు పెట్టడానికి గల కారణం ఇందిరాగాంధీ స్ఫూర్తితో పాటు బూర్గుల రామకృష్ణా రావు కూతురు పేరు కావటం అని కూడా చెబుతారు. బాలికలకు ఉచిత విద్యతో పాటు స్త్రీల ఉపాధి కోసం వృత్తి విద్యా శిక్షణ వసతులు కల్పించటమే ధ్యేయంగా సేవలు చేసి అమ్మగా చూసుకోవటంతో లక్ష్మీబాయి పేరు లక్ష్మీబాయమ్మగా మారింది. 1958లో నూరు మంది విద్యార్థినులతో ఎంసిహెచ్ పాఠశాల ఏర్పడిన తర్వాత 1972లో ఇందిరా ప్రాచ్యసాయం కళాశాల కూడా స్థాపితమై సేవాసదనం విస్తృత స్వరూపం దాల్చింది. ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న విద్యావేత్త టి.వి. నారాయణతో పాటు కొండా మాధవరెడ్డి, బొజ్జం నరసింహులు, బి. రాందేవ్ మొదలగువారు సభ్యులుగా ఉన్న ఈ సొసైటీలో భోజిరెడ్డి వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉండేవారు. సంతానం లేని లక్ష్మీబాయి పొరుగు రాష్ట్రానికి చెందిన ఎం.పీ. కూతురు రాధికను దత్తత చేసుకొంది. ఖద్దరు బట్టలు ధరించి నిరాడంబరంగా కనిపించే సౌజన్యమూర్తి లక్ష్మీబాయమ్మ. తన యావదాస్తినీ సేవాసదనానికి సమర్పించి 1979 జూన్ 2న అసువులు బాసినప్పుడు, ఆమె కోరిక ప్రకారం ఆమె జీవించిన సదనంలోనే సమాధి చెందింది. అయితే ఆమె మరణం తర్వాత ఆమె స్థాపించిన సేవాసదనం ఆశయాలు కూడా సమాధి పొందటం బాధాకరం. ఆమె తదనంతరం ఈ సొసైటీ కొందరు అక్రమార్కుల ఆక్రమణలోకి వెళ్లటం వల్ల 300 మందితో ఉన్న సేవాసదన్ ఐదుగురు విద్యార్థినుల సంఖ్యకు దిగజారి 2004లో పూర్తిగా మూతపడింది. రెండెకరాల భూమికి తోడ్పాటుగా ప్రభుత్వం ఇచ్చిన మరో 23 ఎకరాల స్థలం ప్రస్తుతం కార్పొరేట్ కాలేజీలకు నిలయమై దుర్వినియోగమైపోయింది. బాలికల జూనియర్ కళాశాల పేరుతో 'సంగం లక్ష్మీబాయి విద్యాపీఠ్' మాత్రం మిగిలింది. అన్యాయాలకు వ్యతిరేకంగా విద్యార్థినులు, మహిళలు చేసిన ఆందోళనలు అధికారుల అణచివేతకు గురైనాయి. బంగారు తెలంగాణ సిద్ధి కోసం అహర్నిశలూ పరిశ్రమిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ విషయంపై దృష్టి ప్రసరించటం అవసరం అని స్థానిక ప్రజలు భావిస్తున్నారు.

- ఆచార్య ఎస్వీ రామారావు, 9848012053

ప్రేమే నిజమైన ఔషధం



'స్టిల్ అలైస్'లో ఓ సన్నివేశం

అందంగా, ఆరోగ్యంగా, హాయిగా సాగిపోయే కాలంలో ఒకరికి ఒకరు తోడుండటం సహజమే. కానీ కాస్తంత ఒడిదుడుకులకు లోనయితే ప్రేమగా నిమిరే హస్తం కావాలి. భుజం చుట్టూ చేయి వేసి నేనున్నాన్ననే భరోసాని ఇవ్వాలి. 'నీకేం కాదు, నేను నీతో ఉన్నా' అనే ఓదార్పు అందించాలి. మందులెన్ని వాడినా ప్రేమతో కూడిన ఈ లాలన, దయామృతమే దివ్యమైన ఔషధం. శారీరక అనారోగ్యమో, మానసిక ఆందోళనో మనిషిని అతలాకుతలం చేస్తుంటే "ఎందుకురా కన్నా, నేనున్నా కదా, నీకేం కాదు" అని చెంత నిలిచి ధైర్యం ఇవ్వాలి. 'స్టిల్ అలైస్' సినిమా చూసారా?

ఈ ఏడాది ఆస్కార్ అవార్డులలో జూలియన్ మురే ఉత్తమ నటి పురస్కారాన్ని ఈ చిత్రంలోని కథానాయిక పాత్రని పోషించినందుకు గాను అందుకున్నారు. ఆమె ఒక ప్రొఫెసర్. అల్జీమర్స్ వ్యాధి ప్రాథమిక దశలో ఉందని తెలుసుకున్న క్షణం ఆమె చింతాక్రాంతవుతుంది. తన ప్రపంచమంతా ఇక శూన్యమని తలపోస్తుంది. తను ఇక ముందు టీచింగ్ చేయడమెలా అనే తల్లడిల్లుతుంది. మరోవైపున ఆ వ్యాధిని జయించాలన్న తపనా ఉంటుంది. అయినా అల్జీమర్స్ ఆమెను ఒత్తిడికి లోను చేస్తుంటుంది. అలాంటి సందిగ్ధ సమయాన ఆమెని భర్త, కూతురు మరింత ప్రేమగా చూసుకుంటారు. ఆ పరిస్థితిని ఆమె అధిగమించడానికి సహకరిస్తాడు భర్త. ప్రేమతో ఆమెకు భరోసాగా నిలుస్తాడు. ప్రేమ, ఆప్యాయతలు చూపించే జీవన సహచరుని అండ ఆమెకు గొప్ప ఊరట అవుతుంది. మరోవైపున కూతురు కూడా అంతే స్థాయిలో ప్రేమ చూపుతూ తల్లితో ఉంటుంది.

- మందుల కన్నా ఈరకమైన ప్రేమ మనుషులకు స్వస్థత చేకూరుస్తుంది. ముఖ్యంగా అనుకోకుండా అనారోగ్యం పాలయిన భాగస్వామి పట్ల నిర్లక్ష్యం చూపకుండా ప్రేమతో వ్యవహరిస్తే త్వరగా కోలుకుంటారు.
- అల్జీమర్స్‌గానీ, డిప్రెషన్ గానీ, ఇతరేతర జబ్బులేవైనా ఏ క్షణంలోనైనా రావచ్చు, అంతటితో జీవితం అయిపోయిందనుకునే పరిస్థితి తలెత్తకూడదు. అనారోగ్యాన్ని అధిగమించి ఆరోగ్యవంతులు కావడానికి కేవలం మందులు వాడటంతోనే సరిపోదు, భాగస్వామి ప్రేమమయమైన దయావర్షం కురవాలి.
- ఇద్దరి నడుమ సానుకూలమైన, ప్రేమపూరితమైన సంబంధాలు ఉన్నప్పుడు అనారోగ్యం పాలయితే ఒకరికొకరు తోడుగా నిలుస్తారు. కానీ అంతా బాగుండే రోజుల్లో ఒకరి పట్ల ఒకరు తెలిసీ తెలియకనే నిర్లక్ష్యం చూపితే ఆరోగ్యం బాగో లేనప్పుడు వారి నడుమ సంబంధాలు మరింత జటిలమవుతాయి.
- తొలుత ఆరోగ్యంగా, హాయిగా ఉండే రోజుల్లోనే స్త్రీ పురుషులిద్దరి నడుమ సఖ్యత ఉండాలి. ఒకరిపై ఒకరు అమితమైన ప్రేమను చూపాలి. ఒకరంటే ఒకరికి పట్టింపు ఉండాలి. ఆర్థికపరమైన ఒడిదుడుకుల్లోనూ మనిషిపై నిర్లక్ష్యం చూపకూడదు. తమ అవసరాలు తీర్చట్లేదని, తను చెప్పినట్టు వినట్లేదని పట్టనట్లు ఉండకూడదు. ఇలా చేసినవారు, అనారోగ్యం పాలయిన వేళ ప్రేమనీ, దయనీ ఆశిస్తే వస్తాయా?
- సుదీర్ఘకాలం కలిసి జీవించే వారి నడుమ నిరంతరం సానుకూల దృక్పథం ఉండాలి. ఎదుటి మనిషిని నొప్పించకుండా వ్యవహరించాలి. చిన్నచిన్న అభిప్రాయభేదాలుండొచ్చు. కానీ మనిషిపై విముఖత కలిగేలా వ్యవహరించకూడదు.
- ఒకరంటే ఒకరికి ఆపేక్ష ఉన్నప్పుడు ప్రతి చిన్న విషయాన్నీ పంచుకుంటారు. దాపరికాలకు తావు లేకుండా వ్యవహరించగలరు. ఎదుటి మనిషి సుఖమే ముఖ్యమనే భావన ఇద్దరికీ ఉంటే ఒకరికోసం ఒకరు చిన్న చిన్న సర్దుబాట్లు చేసుకుంటారు. ఆ సర్దుబాట్ల నడుమ వారి బంధం మరింత గాఢమవుతుంది.
- గాఢమైన ప్రేమ, అపారమైన కరుణ ఉన్నప్పుడు ఏ అనారోగ్యమూ వారి దరి చేరదు. అనుకోకుండా అస్వస్థతకు లోనైనా మమత మాసిపోదు. వారు తిరిగి కోలుకునేంతవరకు తమంతట తాము అంకితమై అండగా నిలుస్తారు. ఇలా అతని కోసం ఆమె, ఆమె కోసం అతను నిలబడగలిగే ప్రేమే దివ్యమైన ఔషధం.

\- ప్రణవ

నెమలీక

తెలివైన పని

ఒక రాజ్యంలో చాలా పెద్ద అడవి ఉండేది. అందులో ఎన్నో రకాల జంతువులు నివసిస్తుండేవి. చాలా రోజులుగా వర్షాలు కురవకపోవడం వల్ల ఆ అడవిలో కుంటలన్నీ నీళ్ళు లేక ఎండిపోయాయి. ఒక దగ్గర మాత్రం కొద్దిగా నీళు న్నాయి. అడవిలోని జంతువులన్నీ అక్కడికే వచ్చి నీళ్లుతాగేవి. ఒకసారి ఓ ఏనుగు ఆ కుంట దగ్గరికి వచ్చి నీళ్ళు తాగుతోంది. అప్పుడే అక్కడికి వచ్చిన సింహం "నేను ముందు నీళ్ళు తాగాలి. నువ్వు ఆగు" అంది.

దానికి ఏనుగు "నేను ముందు వచ్చాను కాబట్టి నేను తాగి వెళ్ళిన తర్వాత నువ్వు తాగు" అంది..

కానీ సింహం ఒప్పుకోలేదు. పెద్దగా గర్జిస్తూ... "నేను ఈ అడవికి రాజును. ఇక్కడున్న అన్నిటిపైనా నాకు హక్కుంది. అందుకే నేను ముందు తాగాలి" అంది.

కానీ ఏనుగు వినిపించుకోలేదు. నేనే ముందు తాగాలి అని వాదించింది. సింహం, ఏనుగుల మధ్య మాటా మాటా పెరిగి, పెద్ద గొడవలా తయారయ్యింది. ఇంతలో అక్కడికి నక్క, తోడేలు వచ్చాయి. ఏనుగు, సింహం మధ్య గొడవ చూస్తూ... 'ఈ రెండూ కొట్టుకుంటే ఏదో ఒకటి చస్తుంది. దాన్ని తినొచ్చు' అని అక్కడే కాసుక్కూచ్చున్నాయి నక్క, తోడేలు.

అంత గొడవపడుతూ కూడా నక్కని, తోడేలుని సింహం, ఏనుగు గమనించాయి. 'ఇప్పుడు పంతానికి పోయి మేమిద్దరం కొట్టుకుని చస్తే, తినాలని గుంటనక్కలాగా కూర్చున్నాయి. మనకే నష్టం' అని దేనికదే మనసులో అనుకున్నాయి ఏనుగు, సింహం.

ముందుగా ఏనుగే "సరే మృగరాజా... ఈ అడవికి రాజుకు కనుక నువ్వే ముందు నీళ్ళు తాగు, తర్వాత నేను తాగుతాను" అంది.

కానీ సింహం "ఈ అడవికి రాజునైన నేను మీ అందరి అవసరాలు తీర్చడం నా బాధ్యత. అందుకే నువ్వు తాగి వెళ్ళు. తర్వాత నేను తాగుతాను" అంది. అలా రాబోయే ఆపద గ్రహించి ఏనుగు, సింహం తెలివిగా రాజీకి వచ్చాయి.

ఏనుగు సరేనని కుంటలోకి వెళ్ళి నీళ్ళు తాగిన తర్వాత, సింహం వెళ్ళి తాగింది. చెట్ల వెనుక నక్కిన తోడేలు, నక్క తమకిక ఇక్కడ ఆహారం దొరకదని గ్రహించి వెళ్ళిపోయాయి. ఏనుగు, సింహం కూడా దేనిదారిన అది వెళ్ళిపోయింది.



తేడాలు

ఈ రెండు బొమ్మల మధ్య కొన్ని తేడాలున్నాయి. అవి ఎక్కడున్నాయో కనిపెట్టండి.

నేర్చుకుందాం



రంగులు వేద్దాం



ఆ ఒక్కటి ఏదో...

ఇక్కడ మూడు రకాల బొమ్మలు, నాలుగేసి చొప్పున ఉన్నాయి. ప్రతిదాన్లో ఒకటి మిగతా వాటితో కవలదు. అది ఏదో గుర్తించండి.

బుర్రకథ

ఎన్నో రకాల జానపద కళల్లో బుర్రకథ ప్రత్యేకమైనది. ఇందులో వీరగాథలను, రామయణ, మహాభారతాలను, స్వాతంత్ర్యోద్యమ చరిత్రను కథలుగా చెప్తుంటారు. ఇది చెప్పడానికి ముగ్గురు సభ్యులుంటారు. మధ్యలో ఉండే వ్యక్తి భుజం మీద తుంబుర పెట్టుకుని "వినరా భారత వీర కుమారా విజయం మనదేరా" అని కథ చెబుతుంటే... ఇటు పక్క, అటుపక్క ఉండే ఇద్దరు వ్యక్తులు డోలు కొడుతూ, అతనికి తాన తందాన అంటూ, కొత్త కొత్త ప్రశ్నలు వేస్తూ, సరదాగా నవ్విస్తుంటారు. మధ్యమధ్యలో పిట్టకథలు కూడా చెప్తుంటారు. పక్కనున్న ఇద్దరిలో ఒకరు అతి ఎక్కువగా మాట్లాడుతూ హాస్యాన్ని పంచుతుంటే, అది శృతిమించినప్పుడు రెండో వ్యక్తి దానికి అడ్డుకట్ట వేస్తూ కథను ముందుకు నడిపిస్తుంటాడు. దీనికి 'తందాన కథ' అని మరో పేరు కూడా ఉంది.

అసలు దీనికి బుర్రకథ అనే పేరెందుకు వచ్చిందో తెలుసా...? కథ చెప్పే వ్యక్తి ఉపయోగించే తుంబుర బుర్ర ఆకారంలో ఉండటం వల్ల! ఇందులో పాల్గొనే ముగ్గురూ నవరసాలను పలికిస్తూ చూసేవారికి ఆసక్తి కలిగేటట్టు చెప్పేవారు. ఇప్పుడు ఇవి కనుమరుగైపోయాయి.



అతికించండి

ఈ పులి బొమ్మని ముక్కలుగా చిగినిపోయి, ఆ ముక్కలు తారుమారయ్యాయి. వాటిని సరైన క్రమంలో పెట్టండి.



దారేది?

చేప ఈ చివరి నుండి ఆ చివరి వరకు చేరే మార్గమేది?

బ్రిటిష్ వారి పాలనాకాలంలో సంస్థానాలు రెండు రకాలు. అవి: 1. ప్రత్యక్ష సంబంధమున్నవి. దీనికి ఉదాహరణగా నైజాం సంస్థానాన్ని చెప్పుకొవచ్చు. 2. వంశపారంపర్యంగా నైజాం భూభాగంలో పాలనాపరంగా చిన్న చిన్న సంస్థానాలు. వనపర్తి, గద్వాల, దోమకొండ, పాల్వంచ, గోపాల్‌పేట, పాపన్నపేట, దొంతి, గురుగుంట, లోకాయపల్లి చిన్న చిన్న సంస్థానాలుగా వెలుగొందాయి. నిజాం భూభాగం బ్రిటిష్ రాజ్యంలో ఓ భాగమైతే సంస్థానాలు నైజాం రాజ్యంలో చిన్న చిన్న రాజ్యాలుగా వ్యవహరించబడ్డాయి. అలా వ్యవహరించబడిన సంస్థానాలలో కొల్లాపురం సంస్థానం ఒకటి. ఈ సంస్థానం పాలమూరు జిల్లాలో ఉంది. కొల్లాపురం ప్రాంతం నల్లమల అటవీ క్షేత్రంలో కృష్ణానది తీరంలో ఉంది.

కొల్లాపూర్‌లో కోటలు అనేకం

నల్లమల ప్రాంతంలో రెండవ శతాబ్దానికి చెందిన సోమేశ్వర, సంగమేశ్వర, మల్లేశ్వర ఆలయాలున్నాయి. వీటికి ఎంతో గణనీయమైన పురావస్తు ప్రాముఖ్యత ఉంది. ఈ ఆలయాలు పదిహేను వందల ఏళ్ల క్రితం నిర్మించారు. వెడల్పయిన రహదారులు, దట్టమైన చెట్లతో ఈ ప్రాంతం నిండి ఉండడంతో కొల్లాపూర్‌ను "తెలంగాణ మైసూర్" గా కూడా ప్రజలు పిలుస్తారు. నిజాం కాలంలో కొల్లాపూర్ పరిపాలన పరంగా ప్రముఖపాత్ర వహించింది. కొల్లాపూర్ రాజుకు మంత్రి లేదా సెక్రటరీగా వ్యవహరించిన కాట్ల వెంకట సుబ్బయ్య ఇక్కడివారే. అనంతరం మంత్రిగా పని చేసిన మియాపురం రామకృష్ణారావు కూడా ఇక్కడివారే.

ఈ సంస్థానం వైశాల్యం 191 చ.మైళ్ళు. ఇందులో 30 వేల జనాభా దాదాపు 90 గ్రామాలు ఉండేవి. వార్షిక ఆదాయం ఇంచుమించుగా రెండు లక్షలు. ఈ సంస్థానం కృష్ణానది పరీవాహక ప్రాంతంలో ఉన్నది. పూర్వం జటప్రోలు సంస్థానానికి కొల్లాపురం రాజధాని. సురభి లక్ష్మారాయ బహద్దూర్ వరకు అంటే సుమారు క్రీ.శ.1840 వరకు రాజధాని జటప్రోలుగా ఉండేది. వీరి కాలం నుండి రాజధాని కొల్లాపూర్‌కు మారింది. అప్పటి నుంచి కొల్లాపురం సంస్థానంగా పేరొంది, ఈ ప్రాంతాన్ని పరిపాలించిన వారంతా కొల్లాపురం సంస్థాన ప్రభువులుగా ప్రసిద్ధులయ్యారు. వీరు మొదట్లో పెంటవెల్లి



రాజధానిగా పాలన సాగించారు. సురభి వంశస్థుల పూర్వీకులు దేవరకొండ (నల్గొండ) ప్రాంతం నుంచి ఇక్కడికి వలస వచ్చారని చరిత్రకారుల అభిప్రాయం. ఈ సంస్థానాధీశులు మొదట జటప్రోలులో కోటను నిర్మించుకొని నిజాం ప్రభువులకు సామంతులుగా ఉన్నారు. ఇక్కడి సువిశాలమైన కోటలు, చక్కని భవనాలు సురభి సంస్థానాధీశుల కళాభిరుచిని చాటుతున్నాయి. ఇది మొదటి విజయనగర చక్రవర్తులకు, చివరి నిజాం ప్రభువుకు సామాంత రాజ్యంగ వ్యవహరించబడింది. భారత దేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత, హైదరాబాద్‌పై పోలీస్‌చర్య జరిగి తెలంగాణలోని సంస్థానాలు భారత్‌లో విలీనం అయ్యేవరకు ఈ సంస్థానం సివిల్ మెజిస్ట్రేట్ అధికారాలతో ఉంది. నిజాం ప్రభువులు తమ ఆధీనంలో ఉన్న సంస్థానాలకు సర్వాధికారాలు ఇవ్వటం వల్ల ఆయా సంస్థానాలు స్వేచ్ఛగా పరిపాలన సాగించినాయి.

ఈ సంస్థానాన్ని స్థాపించినది వెలమవీరులు. వీరు కాకతీయ రాజ్య కాలంలో రాజ్యరక్షణలో యుద్ధవీరులుగా చేరారు. ఒక దశలో వీరు స్వతంత్ర రాజ్యం కూడా స్థాపించారు. వీరు శాఖోపశాఖలుగా తెలుగు ప్రాంతంలో అనేక ప్రాంతాలలో పాలకులుగా అధికారాలు చెలాయించారు. వేంకటగిరి, పిఠాపురం, బొబ్బిలి, జటప్రోలు సంస్థానాధీశులకు మూలపురుషుడు ఒక్కడే. రేచర్ల గోత్రికుడైన చెవిరెడ్డి లేదా భేతాళ నాయుడు వీరికి మూలపురుషుడు. ఈయన కాకతీయ చక్రవర్తి గణపతి రుద్రదేవుని పరిపాలన కాలం వాడు. ఇతనికి తొమ్మిదవ తరం వాడైన అనపోతనాయుడు క్రీ.శ.1360 లో కొల్లాపురం సంస్థానాన్ని ఎంతో అభివృద్ధి చేశాడు. ఈ వంశం వారికి కంచికవాట చూరకార, పంచపాండ్య దళవిభాళ, ఖడ్గనారాయణ అనే బిరుదులున్నాయి. సుమారు రెండువందల సంవత్సరాల క్రితం ప్రస్తుతమున్న కొల్లాపురం రాజధానిగా చేసుకొని పరిపాలన సాగించారు. ఈ వంశాన్ని 30 మంది రాజులు దాదాపు 700 ఏళ్ల పరిపాలించారు. జటప్రోలు సంస్థాన స్థాపకుడు కుమార మదానాయుడు.

రెండో జగన్నాథరావు అనేక కోటలు కట్టించి పాలన కొనసాగించాడు. ఈయన 1871 ప్రాంతంలో చంద్రమహల్ అనే రాజప్రసాదాన్ని నిర్మించాడు. అక్కడి నుంచే రాజ్యాపాలన చేశాడు. కొల్లాపురం సంస్థాధీశులు కళలు, సాహిత్యం, ఆయుర్వేదం లాంటి అంశాలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. కృష్ణా ఉపనదిపై లక్ష్మరావు పేరు మీద లక్ష్మాసాగర్ ప్రాజెక్టు నిర్మించారు. మంచాలకట్టలో మాధవస్వామి ఆలయం, సింగోటంలో లక్ష్మానరసింహసాగర్ అనే పెద్ద చెరువును నిర్మించారు. దీనికి ఆనుకునే శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం ఉంది. ఇది అతిపెద్ద పుణ్యక్షేత్రం. ఈ ఆలయం సమీపంలో ఉన్న చెరువును సింగపట్నం శ్రీవారి సముద్రం చెరువుగా పిలుస్తారు. ప్రస్తుతం ఇందులో జూనియర్ కళాశాల కొనసాగుతుంది.

ఈ విధంగా రాజ్యవిస్తరణలో, పరిపాలన నిర్వహణలో సాహిత్య పోషణలో కొల్లాపురం సంస్థానానికి సుదీర్ఘమైన చరిత్ర ఉంది. ఇలాంటి కట్టడాలను ప్రభుత్వ కృషి, ప్రజల చేయూతలో కాపాడుకోవాలి.

- డా. గుంటి గోపి, 8019808207

ఈ భూమ్మీద జన్మించిన ప్రతి మనిషికి ఏదో ఒక ప్రతిభ ఉంటుంది. సాధారణంగా ప్రతిభలేని వారుండరు. మనం ఏర్పర్చుకున్న లక్ష్యానికి అనుగుణంగానే మన సామర్థ్యం రూపుదిద్దుకుంటుంది. ముందుగా మీకు ఇష్టమైన రంగాన్ని ఎన్నుకోండి. ఆ రంగంలో నైపుణ్యం సాధించండి. అదే మీ జీవితానికి ఆధారంగా ఉంటుంది. మిమ్మల్ని ముందుకు నడిపిస్తుంది. మీరు జీవితంలో ఏమి సాధించాలనుకుంటున్నారో స్పష్టంగా మీ లక్ష్యాన్ని నిర్ణయించుకోండి. ఈ విషయంలో గందరగోళానికి గురి కావద్దు. ఒకరికి డాక్టర్ వృత్తి అంటే ఇష్టముంటుంది. మరొకరికి ఇంజనీరింగ్, ఇంకొకరికి వ్యాపారం, జర్నలిజం లేదా రచనలు, ఉపాధ్యాయ వృత్తి ఇలా ఎన్నో రకాల వృత్తులు అందుబాటులో ఉన్నాయి. ఇవి కాకుండా మీ ఉపాధికి సరిపడే ఇంకేమైనా పనులు ఉండవచ్చు. నిద్ర పోయినప్పుడు తప్ప మన మెదడులో ప్రతి క్షణం ఎన్నో ఆలోచనలు వస్తుంటాయి. పోతుంటాయి. అయితే మన గమ్యాన్ని, ఆశయాన్ని, లక్ష్యాన్ని ఏర్పర్చుకునే ముందు అన్ని విషయాలను విశ్లేషించుకోవాలి. దీని కోసం మహనీయుల జీవిత చరిత్రలను చదవాలి. వారు తమ జీవితంలో సంక్షోభ సమయంలో ఎలా వ్యవహరించారో తెలుసుకోవాలి. ఎలా స్పందించారో గమనించాలి. ఈ ప్రపంచంలో ఉన్నత స్థానానికి ఎదిగిన వారందరూ ఒకప్పుడు సామాన్య మానవులేనన్న విషయాన్ని మరచిపోవద్దు. జీవితం అంత సులభమైనది కాదు. ఉచితంగా కలలు కననిస్తుంది.కానీ కష్టపడందే దేనిని దక్కనివ్వద్దు.లెక్కలు కష్టంగా ఉన్నాయని స్కూల్ మారిపోకూడదు. మనం ఎక్కడికి వెళ్లినా అవే లెక్కలు దర్శన మిస్తాయి. అందువల్ల మనమే మారాలి. జీవితం రబ్బరుతో తుడిచి సరిచేయడానికి వీలులేని చిత్ర లేఖనం. మనం ఎంత శ్రద్ధ పెడితే ఆ పెయింటింగ్ అంత అందంగా రూపు దిద్దు కుంటుంది.

వేయి అడుగుల దూరాన్నైనా ఒక అడుగుతోనే ప్రారంభించాలి. మీ జీవితంలో ప్రతి క్షణాన్ని ప్రయోజన పూర్వకంగా మార్చుకోవాలంటే కొన్ని విషయాలను మీరు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. ప్రతి రోజు మనకున్న సమయం 24 గంటలు. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే కొన్ని చిట్కాలను పాటించాలి.

- ఉదయం నుంచి సాయంత్రం వరకు మీరు ఏఏ పనులు చేయాలనుకుంటున్నారో ఒక కాగితం మీద రాసుకోండి. దాని ప్రకారం ఒక్కొక్క పని చేస్తూ ముందుకు వెళ్లండి. మీ విలువైన సమయం వృధా కాకుండా, ఆశించిన పనులను విజయవంతంగా పూర్తి చేయగలుగుతారు.
- సమయ పాలన కచ్చితంగా పాటించాలి. కొంత మంది వ్యక్తులు అవసరమున్నా, లేకున్నా తమ మిత్రులతో గంటల తరబడి మాట్లాడుతూ సమయాన్ని వృధా చేస్తారు. పైగా అసలు పనులు చక్కబెట్టుకునేందుకు తమ వద్ద సమయంలేదని బాధపడతారు.
- ముఖ్యంగా విద్యార్థులు, పోటీ పరీక్షలకు తయరయ్యే అభ్యర్థులు, ఇతర ముఖ్యమైన పనులు చక్కబెట్టుకునే వారికి గ్రంథాలయం, లేదా వారి కార్యాలయమే సరియైన పని స్థలంగా గుర్తుంచుకోవాలి.
- ఇంట్లో టీవీలు మన సమయాన్ని చాల వృధా చేస్తాయి. ఇక పిల్లలున్న ఇళ్లలో ఎల్లప్పుడూ సందడిగా ఉంటుంది. మన పనులను చక్కబెట్టుకోవడం కొంచెం కష్టమే. ఇటీవల నగరాలలో రీడింగ్ రూంలు కూడా అందుబాటులోకి వచ్చాయి.
- మనరోజువారీ పనులను కూడా పూర్తి చేసేందుకు సంకల్ప బలం కచ్చితంగా ఉండాలి.

లక్ష్యానికనుగుణంగానే సామర్థ్యం

- పనులను ఆశించిన స్థాయిలో పూర్తి చేసేందుకు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలి. పనులను అత్యవసరమైతే తప్ప వాయిదా వేయకూడదు. ఏ సౌకర్యాలు లేని వారు కూడా ఉత్సాహంగా పనులు చేస్తున్నారు.

ఇటీవల ఫిలిప్పీన్స్‌లో ఒక విద్యార్థి ఒక హోటల్ లైట్ వెలుగులో రోడ్డుపక్కన చదువుకోవడం చర్చనీయాంశమైంది. ఆ దారిన వెళుతున్న ఒకామె ఆ దృశ్యాన్ని చిత్రీకరించి సామాజిక సైట్‌లో ఉంచడంతో దానికి ఎంతో ఆదరణ లభించింది. ఆ సంఘటనతో ఎంతో మంది స్ఫూర్తి పొందారు. కొందరి దృష్టిలో నువ్వు దమ్మిడీకి కొరగాని వాడివి కావచ్చు. కానీ వెల కట్టడానికి వీలు లేనంత వాడిగా తయారవడం నీ చేతుల్లోనే ఉంది. ప్రతి మనిషి తన శక్తి సామర్థ్యాలను సంపూర్ణ స్వేచ్ఛతో వినియోగించుకుని, అభివృద్ధి అయ్యేందుకు దోహదం చేసేలా ఈ సమాజాన్ని మార్చడమే ధ్యేయంగా పెట్టుకుని ముందుకు వెళదాం.

- జి. గంగాధర్ సిర్ప, 9010330529

సమీక్షలు

మార్కెట్‌ని ప్రతిఘటించే కవిత్వం



కవి : సరికొండ నరసింహరాజు,
పేజీలు : 152, వెల : 100/-
ప్రతులకు : సరికొండ నరసింహరాజు,
ఇం.నెం : ఎ-116, పైలాన్ కాలనీ,
నాగార్జునసాగర్ - 508203.
సెల్ : 9441364022

దేవరాజు విష్ణువర్ధన్ రాజుగారికి ఈ కవితాసంపుటిని సరికొండ నరసింహరాజు అంకితం చేశారు. ఈ సంపుటిలో 66 కవితలున్నాయి. డా॥అద్దేపల్లి రామమోహన్‌రావు, అకడారు వీరారెడ్డి, కొత్తకోట శ్రీనివాసరెడ్డి, మౌనశ్రీ మల్లిక్ లాంటి సాహితీవేత్తలు చక్కటి ముందుమాటలు రాశారు. ప్రగతిశీల దృక్పథం గల ఈ రచయిత మంచి భావుకుడు. చాలా కవితల్లో అభివ్యక్తిలోని గాఢత, సామాజికాంశాల్నే వస్తు ఎంపిక చేసుకుని ఈ కవితలు రాశారు. బాల్యం నుంచి, అమెరికా వెళ్ళే యువత, వృద్ధుల మనోవేదన, సరళీకరణ, ప్రపంచీకరణ వ్యతిరేకం, సామాజిక ఆవేదన, ఆక్రందనలను సరికొండ అక్షరీకరించారు. చాలా కవితలు బహుమతులు పొందాయి. మనిషి మార్కెట్‌యమం చేసే వ్యాపారీకరణపై తిరగబడ్డ వీరి కలం భావశకలం చూద్దాం.

'అప్రకటిత బానిసలు' అనే కవితలో (పేజీ 32) కవి ఇలా అంటారు "మార్నింగ్ 7 ఓ క్లాక్.../ బికిని సుందరి రేజర్‌తో ప్రత్యక్షం / షేవ్ చేయడం మొదలెడుతుంది! క్రికెట్ బాల్‌తో అద్దాలు పగలగొడుతూ... రోడ్డెక్కగానే... హోర్డింగ్‌లన్నీ / కన్నుగీటి పిలిచే ఖరీదైన వేశ్యలే" అంటారు. అంతులేని అసభ్యత, ప్రకటనల్లో మార్కెటిజం పంజా విసురుతోంది. ఇవన్నీ బహుళజాతి కార్పొరేట్ వ్యాపార వ్యవస్థ వల్ల వచ్చినవే.

అద్దేపల్లివారు అన్నట్లు.. సాంస్కృతిక విధ్వంసాన్ని గురించి ఆలోచించినప్పుడు రాబోయే తరాన్ని అంటే ఈనాటి బాల్యాన్ని అన్ని విధాలా ధ్వంసం చేస్తున్నై..

ఆకుపచ్చ ఓ హెన్ని ఆర్పుతున్నారెవరో! (పేజీ 37) అనే కవిత నేటి నేతల (అ)రాజకీయాలకు అద్దం పడుతుంది. దాదాపు అన్ని కవితల్లో ఎన్నో వెంటాడే వాక్యాలున్నాయి ఈ సంపుటిలో. ఈ కవితలో కింది వాక్యాలు ఆలోచింపజేస్తాయి.

"ఆకాశమే ప్రపంచీకరణ అడ్డా అయినప్పుడు
విరిగిన పనిముట్లతో ఇక నేలతల్లి ప్రతిఘటనే ఉంది.
ఇక రాజధాని బీటీ వంగడాలు నాటితే/
కాసేవి విషపు నోట్ల కట్టలే...
ఈ నల్ల రేగడి భూములన్నీ అధికారం ఉమ్మిలో ఈగల్లా
దిష్టి బొమ్మలే కాష్టాలు కాజేస్తున్నప్పుడు
రాజధాని గాజు బొమ్మలో ఇక మట్టి బొమ్మ మాయం".

- తంగిరాల చక్రవర్తి, 9393804472

ఆసక్తిగా సాగే సీక్వెల్ కథలు

కథకు కథ, భీమరాజు
వెంకటరమణ, వెల : 80/-,
పేజీలు : 144,
ప్రతులకు : విశాలాంధ్ర, నవోదయ,
ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు.
భీమరాజు వెంకటరమణ,
సెల్ : 9849239945



ఒక సినిమాకి సీక్వెల్‌గా మరో సినిమాని తీయడం చూశాం, చూస్తున్నాం. అలాగే నవలకు కూడా సీక్వెల్‌గా మరో నవల రాయడం చదివాం. కానీ కథకు మరో కథని సీక్వెల్ రాయడం చాలా అరుదు. అలాంటి అరుదైన సీక్వెల్ కథల సమాహారమే 'కథకు కథ' కథల సంపుటి.

ఓ రచయిత కొన్ని పాత్రల్ని ఎంచుకుని, కొన్ని సంఘటనల సమాహారంగా కథని చెప్తూ, దానికో ముగింపు ఇస్తారు. ఆ కథ అక్కడితో అయిపోతుంది. అదే కథని ఆ రచయితయితే సీక్వెల్‌గా కొనసాగిస్తే ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు. ఎందుకంటే మొదటి కథ ఏ ఉద్దేశంతో రాయడం మొదలు పెడతారో దానిని కొనసాగించడం తేలిక. కానీ ఇక్కడ మొదటి కథకు సీక్వెల్‌గా రాసిన కథకు రచయిత మారారు. సొంతగా కథ రాసేప్పుడు ఉన్న స్వేచ్ఛ మరొకరి కథను పొడిగించడంలో ఉండదు. మొదటి కథ ముగింపునే, కొనసాగింపు కథలో మొదలుగా తీసుకుని దానికి మరో అందమైన ముగింపు ఇవ్వడమంటే కత్తిమీద సామే. అంటే సీక్వెల్ కథ రాసేప్పుడు మూల కథను దృష్టిలో పెట్టుకుని, అందులోని భావం చెడకుండా, రెండింటిమధ్య సమన్వయాన్ని పాటిస్తూ, రెండో కథ ఆసాంతం నడిపించి మరో కొత్త ముగింపునివ్వడం. 'కథకు కథ' కథల సంపుటిలో సలీం రాసిన తొమ్మిది కథలకూ భీమరాజు వెంకటరమణ సీక్వెల్ కథలు రాసేటప్పుడు అలాంటి జాగ్రత్తలే తీసుకున్నారు. మొదటి కథా రచయిత సలీం తన కథలన్నిటినీ ఆధునిక సమాజంలోని కొన్ని కుటుంబాలు ఎదుర్కొనే సమస్యలను ఇతివృత్తంగా తీసుకుని రాశారు. వాటిలో రెండు కథలను (మాంసాహార మొక్కలు, మురికి) నెగెటివ్‌గా ముగిస్తే, వెంకటరమణగారు ఆ రెండు కథలని కూడా తన సీక్వెల్ కథల్లో (సాలెగూడు, పనోడు) పాజిటివ్ ముగింపునిచ్చారు. ఒక కథలోని విషాదాంతాన్ని కూడా సీక్వెల్ కథలో సుఖాంతం చేశారు రచయిత. తొమ్మిది కథలకు మరో తొమ్మిది కథలు చేరి మొత్తం పద్దెనిమిది కథలూ ఏక బిగిన చదివించేవే. మొదటి కథ చదివాక దాని సీక్వెల్ కథ ఎలా మొదలవుతుంది, ఎలా ముగుస్తుంది అనే ఆసక్తి సహజంగా పాఠకులకు ఉంటుంది. పాఠకుల ఆసక్తిని ఏమాత్రం నిరాశపరచవు ఈ కథలు.

- అఖిల

పదకేళి 12

- గొట్టిపర్తి యాదగిరి రావు,
8297277795



అడ్డం :

1. శ్రీమంతుడు (5)
3. మేనమామ కూతురు (4)
6. నలుపు - వెనక్కు తిరిగింది (3)
7. నరం లేనిది. వెనక్కు తిరిగింది (3)
9. రోలుతో ఉండేది. దంచుతుంది (3)
11. రోజులు వెనక్కు తిరిగాయి (3)
14. అద్దె (3)
15. పాము ... విప్పింది అంటారు (3)
17. ఆడ (అక్కడ) కాదు (3)
18. నెలరాజు వెనక్కు తిరిగాడు (3)
19. అబ్బో, ఆమె భలే... (3)
21. వాత వెనక్కు తిరిగింది (2)
24. ప్రభుత్వం ప్రజలనుండి తీసుకునేది (2)
26. సోదరులు (5)

నిలువు :

1. కరీంనగర్ జిల్లాలో పుష్కరాలు జరిగిన ప్రదేశం (4)
2. నదిని దాటడానికి కట్టేది (3)
4. రాయల కాలంలో అంగళ్ళలో అమ్మినవి (4)
5. ఏమీ తినకుంటే కడుపులో వేసేది (3)
8. ఈ ప్రపంచం కాదు, శ్రీశ్రీ రాసింది (5)
10. బియ్యాన్ని రాళ్ళతో.... చేస్తారు (2)
12. రాజు తలకిందులయ్యాడు (2)
13. ద లేని దవడ (2)
14. నవ్వించడానికి పెట్టేది. ఒక సినిమా పేరు (5)
15. స్త్రీ (3)
16. ఫీజు... లోపల కట్టాలి (3)
20. పర్వతాల్లోంచి ఉబికేది. చాలా వేడిగా ఉంటుంది. (2)
22. లావు కాదు. --- (2)
23. ఎద్దుకు తలపై ఉండేది (2)
25. జున్ను కింద నుండి పైకి (2)

గమనిక

➠ సమీక్షకోసం పుస్తకాలు పంపే రచయితలు, ప్రచురణ కర్తలు రెండు ప్రతులు పంపించాలి.

➠ రచయితలే సమీక్షలు రాయించి పంపకూడదు.

➠ పుస్తకాల మీద సమీక్షలకు సంబంధించి సంపాదకులదే తుది నిర్ణయం. ఈ అంశంపై ఉత్తర ప్రత్యుత్తరాలకు, ఫోన్లలో సంప్రదింపులకు తావు లేదు.

చిరునామా: సోపతి, నవతెలంగాణ,
ఆదివారం సంచిక,
ప్లాట్ నెం. 21/1,
ఎం. హెచ్. భవన్, ఆజమాబాద్,
ఇండస్ట్రియల్ ఏరియా,
బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500020.

పదకేళి - 10
సమాధానాలు పంపినవారు :

1. *అత్తివిల్లి బాలసుబ్రహ్మణ్యం, శేరిలింగంపల్లి*
2. *బండె వెంకట్రాములు, సిరిసిల్ల*
3. *నారాయణ, బయ్యారం, ఖమ్మం.*
4. *రమ, ఐ.బి.తాడూర్*
5. *కె.శారద, సూర్యాపేట*

పదకేళి -11 జవాబులు

1 గో	వు		2 త		3 రా	4 య	ల	5 సీ	మ
దా		6 చె	ప్పు	లు		జ		స	
7 వ	న	ము				8 మా	స	ము	
రి		డు		9 రం	10 జ	ని			11 సు
					న		12 న	ర్మ	ద
13 భ	వ	14 న	ము		15 వ	ట్టి	ది		ర్శ
గీ		మ		16 ప్లో	రి			17 కూ	న
ర		స్సు		ను		18 టీ	వీ		చ
థు		19 లు	కా		20 వ			21 వ	క్రం
డు				22 వృ	ద్ధా	శ్ర	మం		

పదకేళి పజిల్‌ని పూర్తి చేసి కరెక్ట్ సమాధానాలు రాసి పంపిన వారి పేర్లు ప్రకటించబడును

గొంగడి ఆడనే ఉన్నది

అంతా ఒల్లెక్కం
పసి పోరగాండ్లతోటి అదే పరాసికం
* * * *
బోనాలైనయి.. బతుకమ్మలయినయి
ఇఫ్తార్లయినయి.. పుణ్యతానాలయినయి
ఇగ యాదాద్రి యాగాదులు కూడ గలిస్తే
బతుకు బంగారమైతదట

పసిడెందుకే.. పచ్చడి మెతుకులు గావాలె
పాపం పుణ్యం దేవుడు దయ్యం
దిక్కులేనోనికి అన్నీ చెవుల పూలె
* * * *
గడీలు దర్వాజలు బిడాయించుకుని
కుషీ కుషీగా సంబురాలు జేస్కుంటున్నయి
బాంచెన్ కాల్మొక్త అంటె జరంత సందిస్తున్నయి
పబ్బతి పడ్తె కాళ్లకాడ బెత్తెడు జాగిస్తున్నయి
* * * *
ఎన్రోజులు ఎటమటమైతరు!
సోంచాయించుడాపి ఇగ లెవ్వుండ్రి!
ఓ ఎల్లన్నా.. మల్లన్నా.. అంజన్నా..
సంచులు సర్దుండ్రి.. ఇసిరెలు వట్టుండ్రి.
మల్ల అసోయిదుల పాడాలె
దొర జులుమేందిరో అని అడగాలె

- బి. నర్సన్, 9440128169

సూర్యున్ని మేల్కొల్పేవాడు

ఇక లే లెమ్మంటూ
ఇంటి పక్క నున్న
మామిడి చెట్టు మీంచి
రెండు పక్షుల వింత కిలకిల ధ్వని

అద్భుతమైన అపురూపమైన
తెల్లారే దృశ్యాన్ని
తప్పిపోతారు
కండ్లు తెరవమంటూ
ముందు ఇంటి కోళ్ళ పిలుపు

అయిదువందల కిలోమీటర్ల ఆవలఉన్న
సోపతిగాని ఎసెమ్మెస్
శుభోదయ హృదయ చలనం
రెండు మూడు రోజులుగా
మనసులో ఆసుకోస్తున్న
కవి సమయ సందర్భం



రెప్పల మొప్పలు తెరచి
మెల్లగా మజ్జుగా చాతగాని
శరీరాన్ని కూడదీసుకుంటాను
రాత్రి చీకట్లను చిమ్మే
చీపుర్లు ఊడుస్తున్న సవ్వడి

ముసి ముసి వెలుతురు
పలుచ పలుచగా
రక్తంలో రంగరించిన కొత్తశక్తి

అతడు పొద్దంతా తేజ్‌గా ఉండేందుకు
ఉదయపు నడుకకు ఉద్యుక్తుడవుతాడు
రాత్రంతా గొర్రెల మందను
తోడేళ్ల బారిన పడకుండా కాపుకాసాడు

దిగులు దద్దరం పుచ్చుకు బీరిపోయిన
ఊరు నారుమడికి
తన్నీరు పెట్టడానికి
బహుశానేకాదు నిజంగా
నిన్న పొద్దుకి పడమరలో కన్నంటుకున్న
సూర్యున్ని తట్టి లేపడానికి
ఉదయాన్ని వెంటపెట్టుకు రావడానికి
తూర్పు దిక్కు నడక మొదలు పెట్టాడు

(ఆత్మీయ బెల్లి యాదయ్యకు...)

- జూకంటి జగన్నాథం,
9441078095

ఖాన్స్‌తో నటించడమంటే...

బాలీవుడ్ నటి కరీనా కపూర్ ఖాన్ త్రయంతో నటించేటప్పుడు బాక్సింగ్ రింగ్‌లో ఉన్నంత అప్రమత్తంగా ఉండాలని అంటోంది. కరీనా ఈ మధ్యే విశ్రాంతి కోసం కుటుంబంతో సహా విదేశాలకు వెళ్ళి తిరిగి వచ్చారు. ప్రస్తుతం తన తరువాతి సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో పాలుపంచుకునే ప్రయత్నాల్లో ఉన్నారామె. ఇటీవల ఓ మేగజీన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికరమైన విశేషాలను తెలియచేశారు. అందులో ముఖ్యమయింది బాలీవుడ్‌ఖాన్ త్రయంపై చేసిన కామెంట్. సల్మాన్, షారుఖ్, అమీర్ ఖాన్... ఈ ముగ్గురితోనూ కరీనా నటించింది. ముగ్గురితో నటించిన సినిమాలు విజయవంతమైనవే. మరి ఈ ముగ్గురు ఖాన్ల మధ్య ఉన్న తేడాలేమిటి అని మేగజీన్ విలేకరి ప్రశ్నించాడు. అందుకు ఆమె చెప్పిన సమాధానం ఏమిటంటే.. "సల్మాన్ రిలాక్స్ అయ్యాడు, ఆమీర్ ఖాన్ కూడా రిలాక్స్ అయ్యాడు. కానీ షారూఖ్ ఖాన్ మాత్రం తనను తాను ఎప్పటికప్పుడు ఉన్నతీకరించుకుంటూనే ఉన్నాడు. ఈ ముగ్గురికీ విడివిడిగా అనేక తేడాలు ఉన్నా ఒక సారూప్యం కూడా ఉంది. వారి ముగ్గురితో పనిచేసేటప్పుడు ఒక బాక్సింగ్ రింగ్‌లో ఉన్న అనుభూతి కలుగుతుంది. అందుకే ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది."

అనుష్క శర్మకు ఫ్లాప్ సెగ

అనుష్క శర్మ కథానాయికగా నటించిన 'బోంబే వెల్వెట్' బాక్సాఫీస్ దగ్గర అట్టర్ ఫ్లాప్ అయింది. దీంతో నిర్మాతల నుండి ఆమెకు రావలసిన బకాయి డబ్బు ఆగిపోయింది. ఈ సినిమాకు భారీ మొత్తంలో చెల్లిస్తామని నిర్మాతలు అనుష్కశర్మతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ముందు కొంత చెల్లించినా పెద్దమొత్తంలో ఇంకా ఆమెకు చెల్లించాల్సి ఉంది. ఎన్నిసార్లు డబ్బుగురించి అడిగినా నిర్మాతలు పట్టించుకోవడంలేదు. దీనికి కారణం బాక్సాఫీస్ వద్ద బోంబే వెల్వెట్ బొక్కబోర్లా పడటమే. నిర్మాతలు నష్టాల్లో కూరుకుపోయారు. అనుష్క శర్మ మాత్రం ఇంకా డబ్బులు వస్తాయనే ఆశగా ఎదురుచూస్తోంది.

దుబాయ్‌లో పరిణీతి



పరిణీతి చోప్రా అధికబరువు కారణంగా ఈ మధ్య బాహ్య ప్రపంచంలోకి రావడంలేదని బాలీవుడ్‌లో గుసగుసలు వినిపిస్తూ ఉన్నాయి. అయితే ఆమె ఇటీవలే విదేశాల్లో కనిపించిందట. అది కూడా నటుడు కరణ్ జోహార్‌తో కలిసి. ఆమె ఇదివరకటి కంటే లావు తగ్గి అందంగా కనిపిస్తుందని చూసినవారు అంటున్నారట. కరణ్, పరిణీతి ఓ రోజు దుబాయ్‌లో కలిసి భోజనం చేశారట. ఆ సందర్భంగా పరిణీతి ఎటువంటి సినిమాలు చేస్తే బాగుంటుందో కరణ్ సలహాలు ఇచ్చినట్లు తెలిసింది.

SOUTHERN GROUP OF HOTELS

• Centralised A.C. with Banquet halls • Complimentary Breakfast, Transport from Railway Station / Airport to our Delhi & Vijayawada Hotels Only

NEW DELHI

HOTEL SOUTHERN ™

style. comfort. enjoy.

18/2 Arya Samaj Road,
Karol Bagh, New Delhi

For Reservations : Call : 011 - 4145 0200

For instant reservations log on to
www.hotelsouthern.com

VIJAYAWADA

SOUTHERN GRAND HOTELS

Opp. Registrar's Office, Gandhi Nagar
Vijayawada, Andhra Pradesh

For Reservations : Call : 0866 - 66 77 777

For instant reservations log on to
www.hotelsoutherngrand.com

JAIPUR

Managed by
ZONE
(Owned by Southern Grand Hotels Pvt. Ltd.)

D-65 A, Madho Singh Road,
Bani Park, Jaipur - 16

For Reservations : Call : 0141-423 1000

For instant reservations log on to
www.zonebythepark.com

International Fixed / Group & Domestic Tour Packages

International Package Tours	Duration	INR
Singapore / Malaysia with 1 Night Cruise	7 Days	82,199/-
Singapore / Malaysia with 2 Nights Cruise	7 Days	82,699/-
Bangkok / Pattaya	5 Days	43,499/-
Singapore / Malaysia / Bangkok / Pattaya	10 Days	98,999/-
Best of Sri Lanka - Ramayana Trail with Sankari Devi Shakti Peetam	7 Days	54,999/-
Best of Dubai	4 Days	45,999/-

(Book an International Package and get a Domestic Package Free) Conditions apply.

PACKAGE TOURS (Ex-Delhi)	Duration
Jaipur - Agra - Taj Mahal - Mathura	2 Days
Mussoorie - Rishikesh - Ram Jhoola - Haridwar	2 Days
Shimla - Kufri - Kullu - Manali - Rohtang Pass	7 Days *
Chandigrah - Manali - Vaishno Devi - Amritsar	8 Days *
Badrinath - Kedarnath - Yamunotri - Gangotri	11 Days *
Allahabad - Varanasi - Gaya - Ayodhya - Agra	8 Days *
Amarnath - Vaishno Devi - Sonmarg - Amritsar	11 Days *

Fares are per person on twin sharing in a room basis, Transport by VOLVO / Hi-tech / Mini Coach * Pure Vegetarian Food.

sricharanamedia.com

SOUTHERN TRAVELS ™

happy holidaying...

Since 1970

Travel Agents & Tour Operators

SOUTHERN TRAVELS PVT. LTD.

(Recognised by Ministry of Tourism, Govt. of India.)

No. 7, Mustafa Towers,
Ayodhya Junction,
Lakdikapul, Hyderabad - 500 004
Tel.: 040 - 2331 8866, 2330 3561
Mob.: 98480 23236
email: hyd@southerntravels.in

No. 6-2-199, Jeevanlal Complex,
Chowrasta, Hanamkonda,
Warangal - 506 001
Tel.: 0870 - 255 5536, 257 8888
Mobile: 81250 23236
e-mail: warangal@southerntravels.in

Book Online Through www.southerntravelsindia.com

Winners of National Tourism Award as "Best Domestic Tour Operator" 7 Times continuously from the Ministry of Tourism, Govt. of India

Branches	New Delhi	Bengaluru	Coimbatore	Chennai	Hyderabad (KPHB)	Vijayawada	Rajahmundry	Vizag
Phone no:	+91 98186 04554	+91 93799 23236	+91 95513 23236	+91 72999 23236	+91 98480 71155	+91 90101 23236	+91 99495 23236	+91 99121 23236